


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 26.06.2026 | సంపుటి: 3 | సంచిక: 144 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | FRIDAY | 26.06.2026 | VOLUME : 3 | ISSUE : 144 | PAGES: 8 | COST: 2/- |

## ప్రభుత్వ ఉద్యోగులకు రూ.1.25 కోట్ల
# ఉచిత ప్రమాద బీమా



- కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వర్తింపు
- దేశ చరిత్రలోనే తొలిసారి
- ఒకటో తేదీనే జీతాలు
- త్వరలోనే 'క్యాష్‌లెస్' హెల్త్ కార్డ్స్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2



## 'క్యూర్'లో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్లు

- పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నిర్మాణాలు
- 28లోగా స్థలాల ఖరారు.. జూలై మొదటి వారంలో బ్రోచర్ విడుదల
- రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి

2

## స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో
# మరోసారి అగ్నిప్రమాదం



- మొదటి అంతస్తులో చెలరేగిన మంటలు
- దట్టమైన పొగతో భయాందోళనకు గురైన వ్యాపారులు
- మంటల అదుపునకు అగ్నిమాపక సిబ్బంది తీవ్ర శ్రమ

3



# తుంగభద్రా నదికి 33 కొత్త గేట్లు

- మూడు రాష్ట్రాల సీఎంలు కలిసి ప్రారంభం
- కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి పాటిల్
- ఒకే వేదికపై డి.కె, చంద్రబాబు, రేవంత్

**బళ్లారి, జూన్ 25(రాజముద్ర న్యూస్):** కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనతో రూ.51 కోట్లతో 33 కొత్త గేట్లను అమర్చారు. ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. తుంగభద్ర డ్యాం కొత్త స్పిల్ వే గేట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు. రూ.51కోట్లతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన 33 కొత్త స్పిల్

మిగతా 3వ పేజీలో..



# ఉద్యోగుల భద్రత రాష్ట్ర ప్రభుత్వానిదే

సీఎం రేవంత్ రెడ్డి

అందుకే ప్రమాద బీమా కోసం బ్యాంకర్లతో ఒప్పందం
ఆదాయం పెంచండి.. మీ అవసరాలు తీరుస్తాం
ఉద్యోగులకు బీమా పథకం ఒప్పంద కార్యక్రమంలో సీఎం రేవంత్




**హైదరాబాద్, జూన్ 25 (రాజముద్ర న్యూస్) :** బతికి ఉన్నప్పుడు ఉన్న బంధాలు చనిపోయిన తరువాత సానుభూతి మాత్రమే చూపుతాయి.. ఆర్థికంగా ఆదుకునేవారు చాలా తక్కువ.. ప్రమాద బీమా ఉద్యోగుల కుటుంబానికి ఒక ధైర్యాన్ని, ఒక భరోసాను ఇస్తుంది అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగుల భద్రత యజమానిదే. రాష్ట్ర ప్రభుత్వమే మీకు యజమాని.. అందుకే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా అందించేందుకు ఇవాళ బ్యాంకర్లతో ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. రాష్ట్ర ఉద్యోగులకు

మిగతా 2వ పేజీలో..



## ట్రిపుల్ తలాక్ ఉండాల్సిందే

- బహుభార్యత్వం కూడా సమర్థనీయమే
- మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్‌సిపి ఎమ్మెల్యే సనా మాలిక్ వ్యాఖ్యలు
- తిప్పికొట్టిన బిజెపి ఎమ్మెల్యేలు
- పాక్‌కు వెళ్లాలని హితవు

2




3

## ఖైరతాబాద్ మహా గణపతి ఉత్సవాలకు అంకురార్పణ

- ఈ ఏడాది 'పంచముఖ సంకటహర మహాగణపతి'



# కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- హిట్లర్ పాలనలో రియల్ ఎస్టేట్ ఢమాల్
- లక్షల మంది పొట్టగొట్టిన రేవంత్
- కేసీఆర్ పాలనలో ఈ ప్రాంతానికి పరిశ్రమలు తెచ్చాం
- బీఆర్ఎస్ చేవెళ్ల సర్వసభ్య సమావేశంలో కేటీఆర్

**చేవెళ్ల, జూన్ 25 (రాజముద్ర న్యూస్) :** కాంగ్రెస్ పరిపాలనా కాలం సగం అయిపోయింది.. రెండున్నరేళ్లకే రియల్ ఎస్టేట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సంక్షోభంలోకి నెట్టి లక్షల మంది ఉపాధి పోగొట్టిండు అని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. చేవెళ్లలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి 'సర' శిక్షణ, బీఆర్‌ఎస్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఒకప్పుడు వెనకబడిన చేవెళ్ల ప్రాంతానికి కేసీఆర్ హయాంలో, గత ప్రభుత్వం ఆధ్వర్యంలో అనేక పరిశ్రమలు తీసుకొచ్చామని, చందన్వెల్లి, సీతారాంపూర్‌లో

మిగతా 2వ పేజీలో..

# ప్రజల ప్రాణాలతో చెలగాటం..



- ఎలుకల మధ్య తయారైన ఫుడ్..
- కుళ్లిన బిర్యానీ, కూరగాయలు..
- ఫుడ్ సేఫ్టీ అధికారుల మెరుపు దాడి

3

## డిజిటల్ అరెస్ట్ ముఠాలపై సీబీఐ మెరుపుదాడులు

- దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో 80 ప్రాంతాల్లో సోదాలు
- 200కు పైగా కేసులతో సంబంధాలపై దర్యాప్తు
- రూ.2 కోట్ల అక్రమ లావాదేవీల గుట్టురట్టు
- చెన్నై, కోల్‌కతాకు చెందిన ఇద్దరి అరెస్ట్

2






## తహశీల్దార్ సుచరిత అక్రమాస్తుల గుట్టురట్టు

- రూ.5.5 కోట్లకు పైగా ఆస్తులు గుర్తింపు
- మరోసారి సోదాలు నిర్వహించిన ఏసీబీ
- నగదు, బంగారం, వజ్రాభరణాలు స్వాధీనం

2



## కొడుకులతో కలిసి స్కెచ్..!

- ఏటీఎం వ్యాన్ నగదు చోరీ కేసులో సంచలన నిజాలు
- ఏటీఎం క్యాష్ చోరీలో డ్రైవర్ హస్తం
- కన్న కొడుకులతో కలిసి రూ.17 లక్షల అపహరణ
- ముందుగానే పక్కా ప్రణాళిక సిద్ధం చేసిన నిందితుడు
- సీసీటీవీ ఫుటేజ్‌తో వెలుగులోకి వచ్చిన నిజాలు


3

## ప్రైవేట్ కాలేజీలకు తాత్కాలిక ఊరట

- జీవో 9పై హైకోర్టు స్టే
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన న్యాయస్థానం
- ఆగస్టు 15లోపు బకాయిల చెల్లింపు చేస్తామని ప్రభుత్వ హామీ

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** ప్రైవేట్ కాలేజీల్లో ఫీజుల వసూళ్లకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9లోని కొన్ని మార్గదర్శకాలపై హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది. ఈ అంశంపై విచారణ

మిగతా 3వ పేజీలో..



# తహశీల్దార్ సుచరిత అక్రమాస్తుల గుట్టురట్టు

**హైదరాబాద్, జూన్ 25:**

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శామీర్‌పేట సస్పెండ్ తహశీల్దార్ సుచరిత నివాసంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు మరోసారి సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భారీ మొత్తంలో అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించారు. ఇప్పటికే లంచం కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న సుచరితకు సంబంధించిన అదనపు ఆస్తుల వివరాలను అధికారులు వెలికితీశారు.

స్థానిక రైతులకు చెందిన 30 ఎకరాల భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో బాధిత రైతులు ఏసీబీని ఆశ్రయించారు. అధికారులు పన్నిన ఉచ్చులో తొలి విడతగా రూ.2 లక్షల లంచాన్ని ప్రైవేట్ డ్రైవర్ ద్వారా స్వీకరిస్తుండగా సుచరిత పట్టుబడ్డారు. అనంతరం ఆమెపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తాజాగా గురువారం నిర్వహించిన సోదాల్లో సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం దామరకుంట గ్రామంలో 2 ఎకరాల 17 గుంటల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. అలాగే హైదరాబాద్‌లో మూడు ఫ్లాట్లు, కీసర, ఖానామెట్ గ్రామాల్లో రెండు ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు వెల్లడైంది. సోదాల్లో రూ.12 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.38 లక్షల నిల్వలు బయటపడ్డాయి. దాదాపు రూ.1.20 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలతో పాటు ఒక వోక్స్‌వ్యాగన్ కారు, ఒక హ్యుందాయ్ క్రెటా కారు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటికి సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. డాక్యుమెంట్ల ఆధారంగా ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ రూ.5.5 కోట్లకు పైగా ఉందని ఏసీబీ అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఈ ఆస్తుల ధరలు మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. సుచరితకు సంబంధించిన మరికొన్ని ఆస్తుల వివరాలపై విచారణ, ధ్రువీకరణ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

# ఉద్యోగుల భద్రత రాష్ట్ర ప్రభుత్వానిదే

మొదటిపేజీ తరువాయి

బీమా రక్షణ కల్పించేందుకు వివిధ బ్యాంకులతో ప్రభుత్వం ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకున్నది. ఈ సందర్భంగా రవీంద్ర భారతిలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొదటగా సింగరేణి కార్మికులకు బీమా కల్పించేందుకు డిప్యూటీ సీఎం ప్రతిపాదించినప్పుడు నమ్మకం కలగలేదు.. ఒక్క రూపాయి చెల్లించకుండా రూ.కోటి బీమా ఎలా సాధ్యం అనిపించింది.. కానీ ప్రమాదవశాత్తు మరణించిన 45మంది సింగరేణి కార్మికుల కుటుంబాలకు రూ.కోటి బీమా సొమ్మును అందించి ఇది సాధ్యమని నిరూపించారు.. అందుకే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా బీమాను అమలు చేయాలని నిర్ణయించాం అని వివరించారు. 'కొందరు నన్ను గుంపు మేస్త్రీ అని అవహేళన చేస్తుంటారు.. ఎవరు ఎలా మాట్లాడినా నేను గుంపు మేస్త్రీనే.. ఈ గుంపంతా నాదే.. ఈ గుంపే నా బలం.. ఈ గుంపే నా ప్రతిష్ఠ.. ఈ గుంపే పేదలకు ప్రభుత్వానికి మధ్య వారధులు.. మేం దొరలం.. మాకు గడీలు ఉన్నాయని కొందరిలా నేను గొప్పలు చెప్పుకోను.. నా హోదా, పదవి మారినా నేను మీకు ఎప్పటికీ రేవంతన్ననే.. మన మధ్య ఉన్నది అన్నదమ్ముల అనుబంధమే.. మీ సోదరుడు ఇవాళ ముఖ్యమంత్రిగా ఉన్నాడు.. అందరం కలిసి రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుదాం.. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కేసీఆర్ పదేళ్లలో రూ.8.11 లక్షల కోట్ల అప్పులు చేసి దివాలా తీయించారని విమర్శించారు. పదేళ్లలో వందేళ్ల విధ్వంసం సృష్టించారన్నారు. పదేళ్లు మొదటి తేదీన జీతాలు ఇచ్చే పరిస్థితి ఉండేదా.. మీరు ఆలోచన చేయండి.. ఇపుడు ఎన్ని అవాంతరాలు ఎదురైనా మొదటి తేదీనే ఉద్యోగులకు జీతాలు అందిస్తున్నాం.. చెప్పిన మాట ప్రకారం విడతలవారీగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిధులు విడుదల చేస్తున్నాం అని వివరించారు. మీకు సమస్యలుంటే మా దృష్టికి తీసుకురండి.. చర్చించుకుని పరిష్కరించుకుందాం అన్నారు. ప్రజలకు అందించే ప్రతీ సంక్షేమ పథకం అమలులో మీ కృషి ఉంది.. మీ నమ్మకమే మా బలం అని పేర్కొన్నారు. నిర్ణయాలు మేం తీసుకున్నా అది అమలు చేసేది మీరే.. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే అది ప్రభుత్వ ఉద్యోగుల చేతుల్లోనే ఉంది అని సీఎం రేవంత్ అన్నారు. మూసీ ప్రక్షాళన చేయాలని మేం ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారు.. మెట్రోను విస్తరిస్తామంటే వద్దే వద్దు అంటున్నారు.. నాడు మేం అభివృద్ధి చేయాలని పోరాడితే ఇప్పుడు వాళ్లు వద్దేవద్దు అని ధర్నాలు చేస్తున్నారు.. ఓట్లు వేయని ప్రజలు ఉంటే ఏంటి.. లేకుంటే ఏంటి అని ఊరిమీద పడి తిరుగుతున్నారు అంటూ కొంచెమైనా వారికి కృతజ్ఞత ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణ కోసం సర్వం కోల్పోయినవారికి మేం పదవులు ఇస్తుంటే ఏవీ చేయొద్దని మాకు అడ్డు పడుతున్నారన్నారు. 30 నెలలుగా ఒక్క రోజు కూడా తాను సెలవు తీసుకోలేదు.. మేం రూపొందించిన ప్రణాళికలన్నీ ఇపుడు ఒక కొలిక్కి వస్తున్నాయి అని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే కదా నేను పదేపదే ఢిల్లీ వెళ్లేది.. మీ సమస్యలు తీర్చాలన్న ఆలోచనే తప్ప మాకు వేరే ఆలోచన లేదు అని అన్నారు. తన రాజకీయ ప్రయాణంలో బాధ్యత పెరిగింది తప్ప నా నడక, నడతలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. అక్రమార్కులను కట్టడి చేస్తే ఆదాయం పెరుగుతుందన్నారు. నేను మిమ్మల్ని కోరేది ఒక్కటే.. రోజుకు ఒక గంట ఎక్కువ పనిచేయండి.. రాష్ట్ర ఆదాయం పెంచండి.. పెరిగిన ఆదాయాన్ని మీ అవసరాలకు వినియోగిస్తాం అని సీఎం రేవంత్ చెప్పారు. మార్పు తీసుకొద్దాం.. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దుదామన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడి పెట్టుబడులను ఆకర్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.. దేశంలో రాష్ట్రం నెంబర్ వన్‌గా ఎదగాలంటే మీ అందరి సహకారం అవసరమని అన్నారు. తెలంగాణ కలను సాకారం చేసుకున్న ఉద్యోగులకు తెలంగాణ ఆదాయం పెంచడం కష్టం కాదు.. ప్రజల కోసం తెచ్చుకున్న తెలంగాణలో ఆ ప్రజల కోసం పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వం తోడుగా ఉంటుందని మాట ఇస్తున్నా అని రేవంత్ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

మొదటిపేజీ తరువాయి

పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేశామని, మైక్రోసాఫ్ట్, అమెజాన్, వెల్‌స్పన్ వంటి కంపెనీలను తీసుకొచ్చి వేలాదిమందికి ఉపాధి అందించామని వివరించారు. హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకున్న రేవంత్ రెడ్డి లాంటి దుర్మార్గుని పాలనలో వేలాదిమంది ఇండ్లను కూలగొడుతున్నారన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి అనేక హామీలు ఇచ్చి మోసం చేశారని, వాటిని గుర్తుంచుకొని సరైన సమయంలో గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రైతు బంధు ఆపేసిన రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో రైతు బంధు ఆపడానికి దివానగాళ్లమా? దిమాగ్ లేదా మాకు? అని అన్నాడు.. మరి ఈరోజు తెలివి లేకనే రైతు బంధు ఆపిండా అని ప్రశ్నించారు. రైతు బంధు బంద్ అయింది.. రాహుల్ బంధు ప్రారంభమైంది అని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల గురించి చెప్పి తన తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. గత ప్రభుత్వంలో చేసిన ప్రతి ఒక్క రూపాయి అప్పు అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు చేశామంటూ మరి రేవంత్ రెడ్డి చేసిన రూ.4 లక్షల కోట్ల అప్పుతో ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. ఇక్కడి డబ్బుల కట్టలతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు దిల్లీకి వరుస కట్టిర్రు.. తెలంగాణలో బ్రహ్మాండంగా ఆర్‌ఆర్ టాక్స్ కొనసాగుతున్నదన్నారు. చేవెళ్ల వేదిక మీదుగా ఎస్సీ, ఎస్టీ సోదరులకు డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చిర్రు.. దళిత బంధు ద్వారా రూ.12 లక్షలు ఇస్తామన్నారు.. ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు, ఇల్లు లేకపోతే జాగతోపాటు ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు ఇస్తామన్నారు.. అని కేటీఆర్ గుర్తుచేస్తూ వాటిని అమలు చేయకుండా అందరినీ మోసం చేశారని ఆరోపించారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి ఉన్న అసైన్డ్ భూములను దళిత, గిరిజనుల నుంచి కాంగ్రెస్ గుంజుకుంటోందన్నారు. ఇన్ని అరాచకాలు, అక్రమాలు, అవినీతిని చూశాక ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పోవాలి.. కేసీఆర్ రావాలి అంటున్నారని చెప్పారు. ఖచ్చితంగా కేసీఆర్‌ని మరోసారి ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రానికి అభివృద్ధిని, సంక్షేమాన్ని అందించాలంటే కార్యకర్తలంతా కష్టపడాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం పార్టీ సభ్యత్వ నమోదు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) కార్యక్రమాలతోనే ఆ దిశగా మన పనిని ప్రారంభించాలన్నారు. వచ్చే అయిదేళ్లలో పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత తాను తీసుకుంటానని, ఖచ్చితంగా ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా, రాజకీయంగా అన్ని అవకాశాలు వచ్చేలా హామీ ఇస్తున్నానని కేటీఆర్ స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, పట్లొల్లా కార్తీక్ రెడ్డి, షాబాద్ మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి, చేవెళ్ల సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి రాంబాబు యాదవ్, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్ట్ ముఠాలపై సీబీఐ మెరుపుదాడులు

**న్యూఢిల్లీ, జూన్ 25:**



దేశవ్యాప్తంగా పెరుగుతున్న డిజిటల్ అరెస్ట్ మోసాలపై సీబీఐ భారీ స్థాయిలో చర్యలు చేపట్టింది. ఈ తరహా సైబర్ నేరాల వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను ఛేదించే లక్ష్యంతో గురువారం దేశంలోని 16 రాష్ట్రాల్లో 80 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌ను పోలి ఉన్న నకిలీ వెబ్‌సైట్‌ను గుర్తించిన నేపథ్యంలో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, అస్సాం, పశ్చిమ బెంగాల్, మణిపూర్, ఒడిశా రాష్ట్రాల్లో ఈ దాడులు కొనసాగాయి. డిజిటల్ అరెస్ట్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్న ముఠాల కార్యకలాపాలపై కీలక సమాచారం సేకరించిన తర్వాత ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

**భారీ నెట్‌వర్క్‌పై దర్యాప్తు**

200కు పైగా డిజిటల్ అరెస్ట్ కేసులతో సంబంధం ఉన్న ఒక పెద్ద నేరపూరిత నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ సోదాలు నిర్వహించినట్లు సీబీఐ తెలిపింది. నకిలీ సంస్థలను ఏర్పాటు చేసి సైబర్ నేరాలకు సహకరిస్తూ, అక్రమ సొమ్మును వివిధ బ్యాంకు ఖాతాల ద్వారా తరలిస్తున్న వ్యవస్థను గుర్తించినట్లు వెల్లడించింది. దర్యాప్తులో భాగంగా చెన్నైకి చెందిన బి.నరేష్, కోల్‌కతాకు చెందిన సంజీవ్ సాహాలను అరెస్ట్ చేశారు. నకిలీ కంపెనీల ద్వారా సైబర్ నేరగాళ్లకు సహకరించడం, మ్యూల్ ఖాతాల ద్వారా అక్రమ నగదు లావాదేవీలు నిర్వహించడం వంటి ఆరోపణలు వారిపై ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**భారీగా స్వాధీనం**

సోదాల సమయంలో నేరాలకు సంబంధించిన కీలక పత్రాలు, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, డిజిటల్ పరికరాలు, బ్యాంకు లావాదేవీల రికార్డులను సీబీఐ స్వాధీనం చేసుకుంది. వీటిని ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం ప్రయోగశాలలకు పంపించినట్లు వెల్లడించింది. ఈ ముఠా దాదాపు రూ.2 కోట్ల అక్రమ లావాదేవీలను నిర్వహించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు అధికారులు పేర్కొన్నారు. మరిన్ని ఆర్థిక లావాదేవీల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

**విదేశీ పౌరులకూ మోసాలు**

ఈ నెట్‌వర్క్ కార్యకలాపాలు కేవలం భారతదేశానికే పరిమితం కాలేదని దర్యాప్తులో తేలినట్లు సమాచారం. పలు దేశాలకు చెందిన పౌరులు కూడా ఈ మోసాల బారిన పడినట్లు గుర్తించిన సీబీఐ, అంతర్జాతీయ దర్యాప్తు సంస్థలతో సమాచారాన్ని పంచుకుంటోంది. డిజిటల్ అరెస్ట్ పేరుతో ప్రజలను భయపెట్టి డబ్బులు వసూలు చేసే ముఠాలపై దర్యాప్తు మరింత విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు.

# 'క్యూర్'లో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్లు

- **రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, జూన్ 25 :**

పేదల సొంతింటి కలను నెరవేర్చే క్రమంలో వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు నివసిస్తున్న ప్రాంతాలకు అత్యంత సమీపంలోనే 'క్యూర' పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల ఉపాధి, పిల్లల చదువు, కుటుంబ జీవన వ్యవస్థ దెబ్బతినకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని వారు నివసిస్తున్న ప్రాంతాల్లోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలోని తన కార్యాలయంలో 'క్యూర్' పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 'క్యూర్' పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రయోగాత్మకంగా తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. 'క్యూర్' పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 వరకు స్థలాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెల 28లోగా అన్ని స్థలాలను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి స్థలానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్లు, నిర్మాణ నమూనాలను కూడా 28లోగా సిద్ధం చేయాలన్నారు. ఇండ్లకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ వివరాలతో కూడిన బ్రోచర్‌ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు. అత్యంత ముఖ్యమైన ప్రాంతాల్లో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నామని, ఈ స్థలాల్లో అన్ డివైడెడ్ షేర్ కింద మహిళలకు వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని మహిళల పేర రిజిస్ట్రేషన్ చేస్తామని మరోమారు స్పష్టం చేశారు.

# ఏం సాధించావని సువర్ణాధ్యాయం?

- **రేవంత్ వ్యాఖ్యలపై బీఆరఎస్ నేత హరీశ్ రావు ధ్వజం**

**హైదరాబాద్, జూన్ 25 :**

తుంగభద్ర డ్యామ్ గేట్లు మార్చినందుకు సంబురాలు చేసుకోవడం పక్కనపెట్టి కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని బీఆరఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు నిలదీశారు. ఆర్డీఎస్ నీటి వాటా విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై రేవంత్ రెడ్డి ఏదైనా స్పష్టమైన హామీ సాధించారా.. ఆంధ్రా వైపు ఉన్న ఆర్డీఎస్ తూములను శాశ్వతంగా మూసివేసేలా ఆర్డీఎస్ ఆనకట్టకు మరమ్మతులు చేసేలా ఏపీ ప్రభుత్వాన్ని ఒప్పించారా అని ప్రశ్నించారు. కర్ణాటక పరిధిలో ఉన్న ఆర్డీఎస్ కాల్వకు తక్షణమే మరమ్మతులు చేసి క్రమం తప్పకుండా నిర్వహించేలా ఆ రాష్ట్రం నుంచి హామీ తీసుకున్నారా అని అడిగారు. ఈ పనులు జరగకపోవడం వల్లే ఆర్డీఎస్ కింద తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటా ప్రతిసారీ కోల్పోవాల్సి వస్తోందన్నారు. కేవలం తుంగభద్ర డ్యామ్ గేట్లు మార్చినంత మాత్రాన తెలంగాణకు రావాల్సిన 15.90 టీఎంసీల నీరు ఎలా వస్తుందో రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు. గత 75 ఏళ్లుగా పాత గేట్లు పనిచేస్తూనే ఉన్నాయి. అయినా ఆర్డీఎస్ ద్వారా తెలంగాణకు ఏనాడూ 5 టీఎంసీలకు మించి నీళ్లు రాలేదు. తుంగభద్ర డ్యామ్ గేట్లు మార్చడానికీ తెలంగాణకు దక్కాల్సిన 15.90 టీఎంసీల నీటి వాటాకు ఎలాంటి సంబంధం లేదు అని హరీష్‌రావు స్పష్టం చేశారు. మరి ఈ కీలకమైన విషయంపై రేవంత్ రెడ్డి సాధించిన హామీ ఏమిటన్నారు. 'సిస్టమ్ లాసెస' అనే వాదనను రేవంత్ రెడ్డి ఎందుకు అంగీకరించారని అడిగారు. కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ అవార్డులో ఈ వాదనకు అసలు గుర్తింపే లేదని, ట్రైబ్యునల్ అవార్డు పరిధిలో లేని ఈ వాదనను అడ్డుపెట్టుకుని తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను తగ్గించడానికి వీల్లేదని ఆయన అన్నారు. కృష్ణా జలాలను పరిమితికి మించి ఏపీ వాడుకుంటున్న తీరును రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదన్నారు. కేసీ కెనాల్ కోసం సుంకేసుల వద్ద ఆంధ్రా ప్రభుత్వం ఏకంగా 39 టీఎంసీల నీటిని వాడుకుంటోంది.. దీనికితోడు, కర్ణాటకతో కుమ్మక్కై కేసీ కెనాల్‌కు వెళ్లాల్సిన దాదాపు 10 టీఎంసీల నదీ జలాలను ఆర్‌బీహెచ్ఎల్‌సీ, ఆర్‌బీఎలఎల్‌సీలకు మళ్లిస్తోంది..

# ట్రిపుల్ తలాక్ ఉండాల్సిందే

**ముంబై, జూన్ 25 :**



మహారాష్ట్ర రాజకీయాల్లో యూనిఫామ్ సివిల్ కోడ్, ట్రిపుల్ తలాక్ అంశాలపై కొత్త వివాదం చెలరేగింది. ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యే సనా మాలిక్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అలాగే ఆమె వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు కూడా వస్తున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యే సానా మాలిక్ చేసిన ప్రకటన కలకలం రేపింది. భారత్ లో ఖురాన్ ఆధారిత చట్టాలను అమలు చేయాలని, ట్రిపుల్ తలాక్‌ను సమర్థించాలని మాలిక్ డిమాండ్ చేశారు. పాకిస్తాన్, ఖురాన్, ముస్లిం వ్యక్తిగత చట్టాలను ఉటంకిస్తూ, భారతదేశంలో ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని ఎన్‌సీపీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పాకిస్తాన్ లాగే, భారత్ కూడా ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని ఆమె తెలిపారు. ట్రిపుల్ తలాక్‌ను సమర్థిస్తూ సనా మాలిక్.. విడాకులలో వివిధ రూపాలు ఉన్నాయి. తలాక్‌ఏహసన్, తలాక్‌ఏఅహ్సన్, తలాక్ ఎబిద్దత్ అనే మూడు రకాల విడాకులు ఉన్నాయి. ట్రిపుల్ తలాక్‌కు సంబంధించి ఆమోదించిన చట్టం, అప్పటికే ఆచరణలో విస్తృతంగా అమలులో లేని ఒక వ్యవస్థపై ఆధారపడి ఉంది. దాని ప్రస్తావన ఎక్కడా లేదు. ఆ తర్వాత బహుభార్యత్వం గురించి మాట్లాడుతూ, బహుభార్యత్వం కేవలం ఒక మతంలోనే కాకుండా, ప్రతి మతంలోనూ ప్రబలంగా ఉంది. ముస్లింలలో బహుభార్యత్వం గురించి బోధిస్తారు. దానిని పాటించాలి. దీని కోసం ఒక చట్టాన్ని రూపొందించాలని అన్నారు. తన వ్యాఖ్యలకు సంబంధించి సనా మాలిక్ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో ఒక వీడియోను పంచుకున్నారు. ట్రిపుల్ తలాక్ చట్టం అమలుపై అసెంబ్లీలో తన అభిప్రాయాన్ని వెల్లడించానని, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అన్ని మతాలకు సమానంగా వర్తించే చట్టాలు ఉండాలని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, ఈ అంశంపై జరిగిన చర్చలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి యోగేష్ కదమ్ స్పందించారని, చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత అవి అన్ని మతాలకు వర్తిస్తాయని చెప్పినట్లు వెల్లడించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు సనా మాలిక్ పై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే నితేష్ రాణెళి మాట్లాడుతూ ట్రిపుల్ తలాక్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ, అసెంబ్లీలోని కొందరు ఖురాన్, ముస్లిం గ్రంథాలను ఉటంకిస్తూ యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ)ని ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నారని అన్నారు. యూసీసీ గురించి రాజ్యాంగంలో ప్రస్తావించారని, ఎవరైనా దేశ చట్టాలను, రాజ్యాంగాన్ని పాటించకూడదనుకుంటే, వారు తమ పదవికి రాజీనామా చేసి పాకిస్తాన్‌కు వెళ్ళిపోవాలి అని సూచించారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ఉచిత ప్రమాద బీమా

**హైదరాబాద్, జూన్ 25**

రాష్ట్రంలోని లక్షలాదిమంది ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల్లో భద్రత, భరోసా కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ ఉద్యోగుల సంక్షేమం కోసం దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా సరికొత్త ఉచిత బీమా పథకాన్ని ఆమోదించిందని వెల్లడించారు. ఈ పథకం ద్వారా అటు ప్రభుత్వంపై కానీ, ఇటు ఉద్యోగులపై కానీ ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడకుండా బ్యాంకులతో మాట్లాడి ఈ భారీ బీమా రక్షణను కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్ర ఉద్యోగులకు బీమా రక్షణ కల్పించేందుకు వివిధ బ్యాంకులతో ప్రభుత్వం ఒప్పందం (ఎంవోయూ) దుర్చుకున్నది. ఈ సందర్భంగా రవీంద్ర భారతిలో గురువారంజరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం ద్వారా సాధారణ ప్రమాదాల్లో మరణిస్తే రూ. కోటి 25 లక్షలు, అదే విమాన ప్రమాదం జరిగితే రూ.2 కోట్లు నుంచి రూ.3 కోట్ల వరకు బీమా పరిహారం అందుతుందని భట్టి వివరించారు. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల ఉద్యోగులకు రూ. 10 లక్షల జీవిత బీమా రక్షణ ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తూ శాశ్వత సంపూర్ణ వైకల్యం లేదా పాక్షిక వైకల్యం సంభవించినా ఈ పథకం ద్వారా ఉద్యోగులకు ఆర్థిక అండ లభిస్తుందన్నారు. కేవలం రెగ్యులర్ ఉద్యోగులకే కాక నెలనెలా ప్రభుత్వ రికార్డుల ద్వారా జీతం పొందే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. తమ కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ఏదైనా ఆపద వస్తే ఆ కుటుంబం రాత్రికి రాత్రే రోడ్డున పడే పరిస్థితి ఉండకూడదు. ఉద్యోగులు కేవలం జీతగాళ్లు కాదు, వారి కుటుంబాలకు ఈ ప్రభుత్వం ఒక పెద్ద దిక్కుగా ఉంటుందని నమ్మకం కలిగించడమే మా లక్ష్యమని భట్టి విక్రమార్క చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు 15 లేదా 20వ తేదీ వరకు రాకపోవడం వల్ల ఉద్యోగులు పడిన ఇబ్బందులను భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ప్రస్తుత కాలంలో ఇళ్లు, వాహనాలు, పిల్లల చదువుల కోసం ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఇన్‌స్టాల్మెంట్స్ (ఈఎంఐలు) కడుతున్నారు. సకాలంలో జీతాలు రాకపోతే వారి అకౌంట్లు బ్యాడ్ అకౌంట్స్‌గా మారి సిబిల్ స్కోర్ దెబ్బతినేది. మా ప్రభుత్వం రాగానే ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉన్నప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి గారు 'ఉద్యోగుల హక్కులను కాపాడాలి' అని గట్టిగా నిర్ణయించుకుని, ఒకటో తేదీ నాడే జీతాలు ఇచ్చేలా కఠినమైన ప్రణాళికను అమలు చేశారని అన్నారు. ఉద్యోగ సంఘాలు ఎప్పటి నుంచో కోరుతున్న హెల్త్ కార్డ్‌ల సమస్యకు ప్రజా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఒక ప్రత్యేక 'ట్రస్ట్' ద్వారా ఉద్యోగులందరికీ పూర్తి స్థాయిలో 'క్యాష్‌లెస్' (నగదు రహిత) వైద్య సేవలు అందించేలా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని, దీనివల్ల ఆరోగ్య భద్రత మరింత మెరుగవుతుందని భరోసా ఇచ్చారు.

**లబ్ధిదారులకు చేరవేసే వారధులు ఉద్యోగులే**

రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ కింద రూ. 10 లక్షల ఉచిత వైద్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్, రేషన్ కార్డులపై సన్నబియ్యం, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ ద్వారా రూ. 1,11,116 ఆర్థిక సాయం వంటి ఎన్నో పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ సంక్షేమ ఫలాలను చిట్టచివరి లబ్ధిదారునికి చేర్చడంలో డెలివరీ మెకానిజంగా ఉద్యోగులే కీలక పాత్ర పోషిస్తున్నారని, అందుకే వారి కుటుంబ సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం తన బాధ్యతగా తీసుకుందని కొనియాడారు. ఈ బీమా పథకం నమోదుకు ముందుకు వచ్చిన బ్యాంకర్లకు భట్టి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుదూర విజన్‌కు అనుగుణంగా 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ఉద్యోగులు, బ్యాంకర్లు, ప్రభుత్వం చేయిచేయి కలిపి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





# తుంగభద్రా నదికి 33 కొత్త గేట్లు

**మొదటిపేజీ తరువాయి**

వే గేట్లను ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, శివకుమార్ కలసి ప్రారంభిండం విశేషం. ఈ కార్యక్రమానికి కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు ఆయా రాష్ట్రాల మంత్రులు, అధికారులు, పార్టీల కార్యకర్తలు హాజరయ్యారు. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం విజయనగర జిల్లా హోసపేటలో జరిగే భారీ బహిరంగ సభకు కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రులు వెళ్లారు. అంతకుముందు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కొప్పల్ జిల్లా మునీరాబాద్‌లోని ఆడిటోరియంలో భేటీ అయ్యారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. తొలుత చంద్రబాబు, డీకే శివకుమార్ భేటీ అవ్వగా.. సమావేశానికి రేవంత్ రెడ్డి 15 నిమిషాలు ఆలస్యంగా వెళ్లారు. అనంతరం ముగ్గురు సీఎంలు, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నీటి సమస్యలపై కీలక చర్చలు జరిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి గేట్ల ప్రారంభోత్సవానికి వెళ్లారు.

**జల వివాదాలను పరిష్కరించుకుందాం : సీఎం రేవంత్‌రెడ్డి**

తుంగభద్ర నది ఒడ్డున.. బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. 'తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం. అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి.. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నానని అన్నారు. నీటి సమస్యలు పరిష్కరించకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తున్నాయి. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నాం. దాదాపు 10 టీఎంసీల నీరు మా వరకూ రావట్లేదు. రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో నిలుస్తాయని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు వలసల గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. మూడు రాష్ట్రాల కరువు జిల్లాలకు ఇది పరిష్కారం చూపబోతోందని పేర్కొన్నారు. గురువారం తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లు ప్రారంభించాక, కర్ణాటక కొప్పల్ జిల్లా మునీరాబాద్ బహిరంగ సభలో సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసు అని చెప్పుకొచ్చారు. మనందరి కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు చంద్రబాబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు.



మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని తెలిపారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోవడం తో నీరు సముద్రం పాలవుతోందని చెప్పారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని అన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తమకు రావడం లేదని చెప్పారు. రైతులకు న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని అన్నారు. చరిత్రలో ఈరోజు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుందని తెలిపారు. తమకు పంచాయితీలు వద్దని.. పరిష్కారం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ, తెలంగాణలోని లక్షలాదిమంది రైతుల సమస్యకు తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పరిష్కారమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నీటి సమస్యను పరిష్కరించక పోవడంతోనే పాలమూరు వాసులు వలసలు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. నీటి సమస్యలు ఓ కొలిక్కి వచ్చాయని.. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించామని తెలిపారు. తుంగభద్రలో పూడికతీతకు సంబంధించిన వ్యవహారంపై కేంద్రమంత్రితో చర్చించామని అన్నారు. తుంగభద్ర నది ఒడ్డున జరిగిన చర్చలు అంతరాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నీటి సమస్యను సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పుకొచ్చారు. ఆయన ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారనే నమ్మకం తమకు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ప్రైవేట్ కాలేజీలకు తాత్కాలిక ఊరట

**మొదటిపేజీ తరువాయి**

జరిపిన న్యాయస్థానం వచ్చే మంగళవారం వరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది. దీంతో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. విచారణ సందర్భంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుల అంశంపై హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కాలేజీలకు చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేయకుండా, మరోవైపు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దని ఆదేశించడం వల్ల విద్యాసంస్థలు ఎలా నిర్వహిస్తాయని కోర్టు అభిప్రాయపడింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం బడ్జెట్‌లో ఎంత మొత్తం కేటాయించారో వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

**బకాయిలపై ప్రభుత్వ వివరణ**

బడ్జెట్ సమావేశాలు ముగిసినప్పటికీ పెండింగ్ బకాయిలు ఎందుకు విడుదల కాలేదని హైకోర్టు ప్రశ్నించింది. బకాయిల చెల్లింపుకు నిర్దిష్ట గడువు తెలియజేయాలని కోరింది. దీనికి స్పందించిన ప్రభుత్వ న్యాయవాది, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన బకాయిలన్నింటినీ ఆగస్టు 15లోపు చెల్లిస్తామని కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు, ప్రభుత్వం పేర్కొన్న గడువులోగా బకాయిలన్నీ పూర్తిగా విడుదల చేస్తే తాము దాఖలు చేసిన పిటిషన్లను ఉపసంహరించుకుంటామని న్యాయస్థానానికి తెలియజేశాయి.

**విద్యార్థుల ఆందోళన**

ఈ కేసులో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరుతూ పలువురు విద్యార్థులు పిటిషన్లు దాఖలు చేశారు. విద్యార్థుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ప్రభుత్వం, కాలేజీ యాజమాన్యాల మధ్య వివాదంలో విద్యార్థులే నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం రెండో, మూడో, నాలుగో సంవత్సరాలు చదువుతున్న విద్యార్థుల చదువులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు. అలాగే ప్రభుత్వం జారీ చేసే కొత్త నిబంధనలు లేదా ఉత్తర్వులు ఉంటే, అవి ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా చేరే విద్యార్థులకు మాత్రమే వర్తించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో తదుపరి వాదనలను అడ్వకేట్ జనరల్ స్వయంగా వినిపిస్తారని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలియజేయడంతో, హైకోర్టు విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

# సంక్షేమమే ప్రజా ప్రభుత్వ అజెండా

**హైదరాబాద్, జూన్ 25:**

సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురువారం బాబాసాహెబ్ అంబేద్కర్ సెక్రటేరియట్ లో బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వశాఖల సమీక్షా సమావేశం ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో జరిగింది. ఈ ఈ సమావేశంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రైవేట్ భవనాల్లో వసతి పొందుతున్న విద్యార్థులను సాధ్యమైనంత మేరకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు మార్చే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలలు హాస్టళ్లో గురుకులాలలో మరమ్మతు పనులు ఒక నెలలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.7.5 కోట్ల మరమ్మతు బిల్లులను ప్రాధాన్యతతో క్లియర్ చేయాలని ఆర్థిక శాఖ అధికారులకు ఉప ముఖ్యమంత్రి సూచించారు. సంక్షేమ గురుకులాలు, హాస్టళ్ల రెంట్ ఛార్జీలు, డైట్, కాస్మోటిక్ ఛార్జీలకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ కు పంపాలని ఆయా శాఖ కార్యదర్శులకు ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు సంబంధించిన బిల్లులు ఏ కారణం చేతనైనా పంపకపోతే.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన అధికారులను హెచ్చరించారు. స్టడీ సర్కిళ్లను బలోపేతం చేసి, యూపీఎస్సీ, గ్రూప్ సర్వీసులు, ఇతర పోటీ పరీక్షల్లో విజయశాతాన్ని పెంచాలన్నారు. సంక్షేమ శాఖలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వాటిని వెంటనే ఆర్థిక శాఖ క్లియరెన్స్ చేస్తుందని అన్నారు. అంబేద్కర్ టవర్, బాబూ జగ్జీవన్ రామ్ విద్యార్థి వసతి భవనాల నిర్మాణానికి సంబంధించి నెలవారీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను అదేశించారు. బహుళ అంతస్తుల అంబేద్కర్ భవనాన్ని 2027 ఏప్రిల్ 14న ప్రారంభించేలా లక్ష్యం నిర్దేశించుకోవాలన్నారు. అన్ని స్వయం ఉపాధి కార్యక్రమాలను రాజీవ్ యువ వికాసం కింద అమలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత ఈవీ ద్విచక్ర వాహన (స్కూటర్) పథకంకు సంభందించిన పూర్తి నివేదికను సమర్పించాలన్నారు. మెరుగైన ఆర్థిక ప్రణాళిక కోసం వార్షిక, త్రైమాసిక నిధుల అవసరాలను సమర్పించాలని తెలిపారు. అన్ని జిల్లాల్లో డా. బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ల స్థాపనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకుంటూ బిల్లులను క్రమం తప్పకుండా సమర్పించి క్లియరెన్స్ పొందాలని ఆయా శాఖల కార్యదర్శులకు ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజాప్రభుత్వం వచ్చాక 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మొటిక్ చార్జీలు ఒకేసారి పెంచిందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. పెంచడమే కాకుండా ఆ బిల్లులు అన్ని ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నామని ఆయన చెప్పారు. సంక్షేమ శాఖల ఆధ్వర్యంలోని అన్ని విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని అన్నారు.

# కొడుకులతో కలిసి స్కెచ్..!

**హైదరాబాద్, జూన్ 25:**

హైదరాబాద్‌లోని ఐఎస్‌సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఏటీఎం నగదు చోరీ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నగదు రవాణా వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తే తన ఇద్దరు కుమారులతో కలిసి ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. రూ.17 లక్షల నగదుతో పరారైన నిందితుల కోసం పోలీసులు విస్తృత గాలింపు చేపట్టారు. జగిత్యాలకు చెందిన శ్రీనివాస్ కొద్ది నెలల క్రితం ఓ ప్రైవేటు భద్రతా సంస్థలో డ్రైవర్‌గా చేరాడు. విధుల్లో భాగంగా క్యాష్ కస్టోడియన్లు, గన్‌మెన్‌తో కలిసి నగరంలోని పలు ఏటీఎంల లో నగదు నింపే బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఘటన జరిగిన రోజూ నగరంలోని ఆరు ప్రాంతాల్లో నగదు రీఫిల్లింగ్ పూర్తి చేసిన బృందం ఈదిబజార్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు చేరుకుంది.
ఏటీఎంలో నగదు నింపేందుకు క్యాష్ కస్టోడియన్లు, గన్‌మెన్ లోపలికి వెళ్లిన సమయంలో వ్యాన్ వద్ద ఒంటరిగా ఉన్న శ్రీనివాస్ ముందుగానే సిద్ధం చేసుకున్న ప్రణాళికను అమలు చేశాడు. వ్యాన్‌లో ఉన్న రూ.17 లక్షల నగదు బ్యాగ్‌ను తీసుకుని బయట వేచి ఉన్న తన పెద్ద కుమారుడి ద్విచక్ర వాహనంపై అక్కడి నుంచి పరారయ్యాడు.
ఏటీఎం నుంచి బయటకు వచ్చిన సిబ్బంది డ్రైవర్ కనిపించకపోవడంతో పాటు నగదు బ్యాగ్ కూడా లేకపోవడం గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు.
సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా వ్యాన్‌ను మొదటి నుంచే ఓ ద్విచక్ర వాహనం వెంబడిస్తున్నట్లు గుర్తించారు. ఆ వాహనాన్ని నడిపింది శ్రీనివాస్ పెద్ద కుమారుడేనని నిర్ధారించారు. చోరీ అనంతరం ఇద్దరూ ఉప్పుగూడ ప్రాంతానికి చేరుకుని అక్కడ చిన్న కుమారుడిని కలిశారు. దొంగిలించిన నగదులో కొంత మొత్తాన్ని అతనికి ఇచ్చిన తర్వాత శ్రీనివాస్, అతని పెద్ద కుమారుడు మరో వాహనంలో శంషాబాద్ వైపు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు.
సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుల కదలికలను పోలీసులు గుర్తించారు. పరారీలో ఉన్న ముగ్గురి కోసం ప్రత్యేక బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. త్వరలోనే నిందితులను అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# ప్రజల ప్రాణాలతో చెలగాటం..

**హైదరాబాద్, జూన్ 25 :**

హైదరాబాద్ నగరంలోని ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లలో నాణ్యత లేని వంటశాలలు బయటపడుతున్నాయి. తాజాగా కొండాపూర్‌లోని 'జాయకా ఫుడ్ కోర్ట్' (Zayqa Food Court) లో షాకింగ్ నిజాలు వెలుగుచూశాయి. ఈ ఫుడ్ కోర్టులో ఎలుకలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయంటూ ఓ కస్టమర్ వీడియో తీసి అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు మెరుపు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. రెస్టారెంట్‌లో ఎలుకలు విచ్చలవిడిగా తిరుగుతూ ఆహార పదార్థాల ప్యాకెట్లను కొరికేసినట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా ఫుడ్ ఐటమ్స్, ప్యాకేజింగ్ మెటీరియల్స్ స్టోర్ చేసే ప్రాంతాల్లో ఎలుకల విసర్జనలు పడి ఉండటాన్ని గమనించారు. వీటికి తోడు, అస్సలు పనిచేయని ఓ ఫ్రీజర్‌లో కుళ్లిపోయిన కూరగాయలు, పాడైపోయిన చికెన్ బిర్యానీని నిల్వ ఉంచినట్లు అధికారులు కనుగొన్నారు. కిచెన్ పరిసరాలన్నీ తీవ్ర అపరిశుభ్రంగా మారడమే కాకుండా, కనీస నిబంధనలైన ఉద్యోగుల మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, రెస్టారెంట్ పెస్ట్ కంట్రోల్ రికార్డులు ఏవీ యాజమాన్యం వద్ద అందుబాటులో లేవు. ఈ స్థాయిలో ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటూ తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడినందుకు గానూ ఫుడ్ సేఫ్టీ అధికారులు జాయకా ఫుడ్ కోర్ట్ ఫుడ్ లైసెన్స్‌ను తక్షణమే సస్పెండ్ చేశారు. అనంతరం ఆ ఫుడ్ కోర్టును పూర్తిగా సీజ్ చేశారు. నగరంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న తనిఖీల్లో ప్రముఖ రెస్టారెంట్ల అసలు రంగు బయటపడుతుండటంతో నగరవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నగరంలో నాణ్యత కొరత..**

ఇక, నగరవాసులకు బిర్యానీ అంటే కేవలం ఆహారం కాదు, అదొక ఎమోషన్. కానీ గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని ప్రముఖ హోటళ్లు, పేరున్న రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు జరుపుతున్న తనిఖీలు చూస్తుంటే.. మనం తినేది ఆహారమా లేక రోగాలా? అనే భయం పట్టుకుంటోంది. తిండి ప్రియులకు ఈ నిజాలు నిజంగానే విస్తుగొలుపుతున్నాయి. టాస్క్‌ఫోర్స్ అధికారులు నగరంలోని ఐటీ కారిడార్ నుంచి పాతబస్తీ వరకు జరిపిన మెరుపు దాడుల్లో దిగ్భ్రాంతికరమైన విషయాలు బయటపడ్డాయి. చికెన్, మటన్ ముక్కలు కుళ్ళిపోయి, బూజు పట్టినా సరే.. వాటికి రంగులు, మసాలాలు దట్టించి కస్టమర్ల ప్లేట్లలోకి నెట్టేస్తున్నారు. చికెన్ 65, కబాబ్స్ వంటి వంటకాలు చూడగానే నోరూరుంచేలా చేయడానికి క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదకరమైన సింథటిక్ రంగులను విచ్చలవిడిగా వాడుతున్నారు. ఇక కిచెన్‌లలో ఈగలు, బొద్దింకలు, ఎలుకలు స్వైరవిహారం చేస్తున్నాయి. డ్రైనేజీ పైపుల పక్కనే వంటకాలను సిద్ధం చేయడం, కనీసం చేతులకు గ్లౌజ్స్ లేకుండా వండడం, వాడిన నూనెనే మళ్లీ మళ్లీ మరిగిస్తూ వాడడం సర్వసాధారణమైపోయింది.



# స్వప్నలోక్ కాంప్లెక్స్ లో మరోసారి అగ్నిప్రమాదం

**హైదరాబాద్, జూన్ 25:**

సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో గురువారం మరోసారి అగ్నిప్రమాదం చోటు చేసుకుని కలకలం రేపింది. భవనం నుంచి ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగలు వ్యాపించడంతో లోపల ఉన్న వ్యాపారులు, సందర్శకులు భయాందోళనలకు గురై బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు.
కాంప్లెక్స్ మొదటి అంతస్తులో ఉన్న ఓ కార్యాలయంలో ప్రమాదం సంభవించినట్లు అధికారులు తెలిపారు. మంటలు వేగంగా వ్యాపించడంతో భవనం అంతటా పొగలు అలుముకున్నాయి. దీంతో లోపల ఉన్న వారిని అప్రమత్తం చేసి బయటకు తరలించారు.

**కార్యాలయంలోనే ప్రమాదం**

వ్యాక్స్ కన్సల్టింగ్ సొల్యూషన్స్ కార్యాలయంలో తొలుత మంటలు చెలరేగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. కార్యాలయంలో వెలిగించిన దీపం కారణంగా వైర్లకు మంటలు అంటుకుని షార్ట్ సర్క్యూట్ జరిగి ఉండవచ్చని అగ్నిమాపక అధికారులు అనుమానిస్తున్నారు. అయితే ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను నిర్ధారించేందుకు విచారణ కొనసాగుతోంది.
దట్టమైన పొగ కారణంగా అగ్నిమాపక సిబ్బందికి సహాయక చర్యల్లో ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినప్పటికీ ఫైర్ టెండర్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. భవనంలో ఎవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో కూడా తనిఖీలు నిర్వహించారు.

**మళ్లీ పునరావృతమైన ప్రమాదం**

గతంలో ఇదే స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదం తీవ్ర విషాదానికి కారణమైన విషయం తెలిసిందే. ఆ ఘటనలో ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవించగా, ఇప్పుడు మళ్లీ అదే భవనంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.
స్థానికులు, వ్యాపారులు భవన భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**విచారణ కొనసాగుతోంది**

ప్రస్తుత ప్రమాదంలో జరిగిన నష్టం, అగ్నిప్రమాదానికి గల అసలు కారణాలపై అగ్నిమాపక శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడి కానున్నాయి. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# ఖైరతాబాద్ మహా గణపతి ఉత్సవాలకు అంకురార్పణ

**హైదరాబాద్,జూన్ 25:**

ఖైరతాబాద్ బడా గణేశుడి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు మొదలయ్యాయి. నగరంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహా గణపతి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. నిర్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గురువారం సాంప్రదాయబద్ధంగా కర్ర పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 69 అడుగుల భారీ విగ్రహం నమూనా పోస్టర్‌ను ఉత్సవ కమిటీ ఆవిష్కరించింది. ఈ ఏడాది పంచముఖ సంకటహర మహాగణపతిగా ఖైరతాబాద్ గణేశుడు దర్శనమివ్వనున్నాడు. విగ్రహానికి ఓ వైపు సోమనాథ్ జ్యోతిర్లింగం, మరోవైపు కాళీమాత విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి పండుగ జరగనుంది. ఈ ఏడాదితో ఖైరతాబాద్‌లో బడా గణేషుడి ఉత్సవాలు ప్రారంభమై 72 ఏళ్లు పూర్తికానున్నాయి. ఈ పూజా కార్యక్రమం అనంతరం స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ ఏడాది కొలువుదీరనున్న వినాయకుడి నమూనా పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేశారు. రాబోయే వినాయక చవితి పండుగ నాటికి, అంటే కేవలం 82 రోజుల్లోనే అన్ని హంగులతో కూడిన 70 అడుగుల భారీ మహా గణపతి విగ్రహాన్ని పూర్తి చేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలు సమసిపోయి, శాంతి చేకూరాలనే సంకల్పంతో ఈ సారి ఖైరతాబాద్ గణేషుడిని 'పంచముఖ సంకట హార మహా గణపతి' రూపంలో ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ భారీ విగ్రహానికి కుడి వైపున ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన సోమనాథ్ జ్యోతిర్లింగం రూపాన్ని, ఎడమ వైపున భక్తులను రక్షించే కాళికామాత విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దనున్నారు. లోకకల్యాణార్థం కొలువుదీరనున్న ఈ పంచముఖ గణపతి విశేష రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకోనుంది.



# ఇరాన్‌తో ఆయిల్ డీల్‌కు మళ్లీ అవకాశం!

ప్రపంచం బాగుండాలంటే ముందు ట్రంప్ దూకుడుకు అక్కడి పార్లమెంట్ కళ్లెం వేయాలి. ఇరాన్‌పై ఇంకా ఆంఇులు విధించడం, బెదిరించడం వంటివి చేయకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఒక్క ట్రంప్ కారణంగా ప్రపంచం యావత్తూ అతాలకుతలం అయ్యింది. సునీమా వచ్చినంత పనయ్యింది. మళ్లీ కోలుకోవడమెలా అన్న సందిగ్ధంలో ప్రపంచ దేశాలు ఉన్నాయి. అన్ని దేశాల ఆర్థిక స్థితి దిగజారింది. ముఖ్యంగా భారత్ లాంటి అనేక దేవాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో ఇరాన్‌ను తన మానా తను బతికేలా చూడాలి. ట్రంప్ ఇక తన దేశ పురోగతికి సమయం కేటాయిస్తే చాలు. హర్మ్యూజ్ తెరుచుకోవడం, చమురు ధరలు దిగిరావడం అన్నది ఊరటనిచ్చే అంశం. ముఖ్యంగా భారత్‌కు పెద్ద ఊరట అని చెప్పాలి. అలాగే భారత్ ఎవరి వద్ద చమురు కొనాలో వద్దో అన్నది అమెరికాకు సంబంధించిన వ్యవహారం కాదు. భారత్ ఎవరితో వాణిజ్యం చేయాలో చేస్తుంది. ఎవరితో చమురు డీల్ చేసుకోవాలో చేసుకుంటుంది. అంతేగానీ వేలుపెట్టాలని ఇక ట్రంప్ చేడడం మానుకోవాలి. ట్రంప్ తీరువల్ల అమెరికా ఇప్పటికీ పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. అక్కడా చమురు ధరలు పెరిగాయి. నిరుద్యోగం పెరిగింది. అక్కడున్న వారిని వెళ్లగొట్టే ప్రయత్నంలో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రణసంకటంగా మారాయి. ముఖ్యంగా భారతీయ టెక్కీలకు ఇదొక సమస్యగా మారింది. ఇకపోతే చమురు ధరలు దిగిరావడం, మళ్లీ హర్మోజ్ తెరుచుకోవడంతో ఇక స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశం వచ్చింది. దీనిపై అటు ట్రంప్ కానీ, ఇటు ఇరాన్ కానీ పేచీలు లేకుండా చూసుకోవాలి. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో భారత్-ఇరాన్ మధ్య ఇంధన రంగంలో మళ్లీ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ చమురు మంత్రి మొహ్సెన్ పక్‌నెజాద్ ఈ వారం భారత పెట్రోలియం మరియు సహజ వాయు మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశం కానున్న నేపథ్యంలో, భారత్‌కు ఇరాన్ నుంచి ముడి చమురు సరఫరాల భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత ఈ ఏడాది ప్రారంభంలో పరిమిత స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. అమెరికా ఆంక్షలకు ముందు భారత్‌కు ప్రధాన ముడి చమురు సరఫరాదారుల్లో ఇరాన్ ఒకటి. ముఖ్యంగా తక్కువ ధరలు, అనుకూల క్రెడిట్ సౌకర్యాలు, భారత రిఫైనరీలకు అనువైన నాణ్యత కారణంగా ఇరాన్ చమురుకు మంచి డిమాండ్ ఉండేది. భారత్-ఇరాన్ మధ్య జరగనున్న తాజా చర్చలు ఇంధన రంగంలో కొత్త అవకాశాలకు దారితీయవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు పునరుద్ధరించబడేందుకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని, భవిష్యత్ కొనుగోళ్లు వాణిజ్య ప్రయోజనాలు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు మరియు ఆంక్షల పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. 2015లో భారత్ సుమారు 11 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. అది దేశ మొత్తం చమురు దిగుమతుల్లో 6 శాతం వాటాను కలిగి ఉంది. 2016లో ఈ దిగుమతులు 14 ఎంఎంటీలకు చేరి వాటా 6.7 శాతానికి పెరిగింది. అయితే, 2017లో ఇరాన్ నుంచి దిగుమతులు భారీగా పెరిగాయి. ఆ ఏడాది భారత్ 27 ఎంఎంటీల చమురును కొనుగోలు చేయగా, దేశ మొత్తం చమురు అవసరాల్లో ఇరాన్ వాటా 12.6 శాతానికి చేరుకుంది. ఇదే గరిష్ట స్థాయి. 2018లో దిగుమతులు 23 ఎంఎంటీలకు తగ్గినా, ఇరాన్ వాటా 10.4 శాతంగా కొనసాగింది. 2019లో 24 ఎంఎంటీల దిగుమతులతో ఇరాన్ వాటా 10.6 శాతంగా నమోదైంది. అయితే 2019 మేలో అమెరికా ఇరాన్‌పై ఆంక్షలను కఠినతరం చేసి, చమురు కొనుగోలు చేసే దేశాలకు ఇచ్చిన మినహాయింపులను రద్దు చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీంతో భారత్ ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లను నిలిపి వేయాల్సి వచ్చింది. ఈ ప్రభావం 2020లో స్పష్టంగా కనిపించింది. ఆ ఏడాది భారత్ కేవలం 2 ఎంఎంటీల చమురును మాత్రమే ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. దీంతో దేశ మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా 1 శాతం కంటే దిగువకు పడిపోయింది. ఇటీవల నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ (ఎన్ఐఓసీ) భారత రిఫైనరీలు, వ్యాపార సంస్థలను సంప్రదించి భవిష్యత్ చమురు సరఫరాలపై చర్చలు ప్రారంభించి నట్లు సమాచారం. అయితే భారత ర్గి÷నైరీలు ప్రస్తుతం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. అమెరికా ఆంక్షలపై స్పష్టత, చెల్లింపు విధానాలు, షిప్పింగ్ మరియు బీమా సౌకర్యాలపై భరోసా లభించిన తర్వాతే పెద్ద ఎత్తున కొనుగోళ్లపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కెప్లర్ డేటా ప్రకారం, జూన్ నెలలో భారత్ రోజుకు సుమారు 73 వేల బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురును దిగుమతి చేసుకుంది. ఏప్రిల్‌లో పరిమిత స్థాయిలో పునఃప్రారంభమైన సరఫరాలు క్రమంగా పెరుగుతున్నట్లు ఇది సూచిస్తోంది.

# వెనిజువెలాను వణికించిన జంట భూకంపాలు

- 39 సెకన్ల వ్యవధిలో రెండు భారీ ప్రకంపనలు
- భవనాలు కూలిపోవడంతో తీవ్ర విధ్వంసం.. అత్యవసర పరిస్థితి ప్రకటించిన ప్రభుత్వం



**కారకాస్, జూన్ 25:** వెనిజువెలాలో వరుసగా సంభవించిన రెండు శక్తివంతమైన భూకంపాలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. కేవలం 39 సెకన్ల వ్యవధిలో రిక్టర్ స్కేలుపై 7.2, అనంతరం 7.5 తీవ్రతతో నమోదైన ప్రకంపనలతో రాజధాని కారకాస్‌తో పాటు కరీబియన్ తీర ప్రాంతాలు వణికిపోయాయి. భారీ భవనాలు, నివాస సముదాయాలు కూలిపోగా, ప్రాథమిక సమాచారం ప్రకారం 32 మంది మరణించగా, 700 మందికి పైగా గాయపడినట్లు వెనిజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం కారకాస్‌కు పశ్చిమాన సుమారు 168 కిలోమీటర్ల దూరంలోని మోరన్ సమీపంలో, 22 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం నమోదైంది. దాదాపు శతాబ్ద కాలం తర్వాత నమోదైన అత్యంత శక్తివంతమైన భూకంపంగా అధికారులు పేర్కొంటున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు సూచిస్తున్నాయి. లా గువైరా, మోరన్, కారకాస్ పరిసర ప్రాంతాల్లో అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. సైమన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో టెర్మినల్ భవనం పైకప్పు దెబ్బతినడంతో విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలను మూసివేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. భూకంపాల అనంతరం దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించిన తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు భవనాల్లోకి వెళ్లకుండా బహిరంగ ప్రదేశాల్లోనే ఉండాలని ప్రభుత్వం సూచించింది. అనంతర ప్రకంపనల ముప్పు ఇంకా కొనసాగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. భూకంపం సంభవించడానికి కొన్ని క్షణాల ముందే ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్ ద్వారా పలువురు స్మార్ట్‌ఫోన్ వినియోగదారులకు హెచ్చరికలు అందినట్లు సోషల్ మీడియాలో స్క్రీన్‌షాట్లు వైరల్ అవుతున్నాయి. యాక్సిలరోమీటర్ సెన్సార్ ఆధారంగా పనిచేసే ఈ వ్యవస్థ ప్రాథమిక భూకంప తరంగాలను గుర్తించి ముందస్తు హెచ్చరికలు పంపినట్లు టెక్నాలజీ నిపుణులు చెబుతున్నారు. వెనిజువెలాలో సంభవించిన ఈ ప్రకృతి విపత్తుపై ప్రపంచ దేశాలు సానుభూతి వ్యక్తం చేశాయి. బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా సహాయక చర్యలకు అవసరమైన మద్దతు అందిస్తామని వెల్లడించారు.

## ఒకేరోజు పలు దేశాల్లో ప్రకంపనలు

కాలిఫోర్నియా, జపాన్, పుల్వామాలోనూ ప్రకంపనలు

వెనెజువెలా దేశం శతాబ్దకాలంలో ఎన్నడూ చూడని ప్రకృతి విపత్తును చవిచూసింది. వెనువెంటనే రెండు శక్తిమంతమైన భూకంపాలతో ఉక్కిరిబిక్కిరైంది. తొలి భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదు కాగా, రెండోది మరింత తీవ్రత (7.5)తో వచ్చింది. అదే సమయంలో కొంచెం అటూఇటుగా అమెరికాలోని కాలిఫోర్నియాలో (5.6), జపాన్ (7.2)లోనూ భూకంపాలు వచ్చాయి. ప్రపంచంలో ఒకే రోజు ఇలా వేర్వేరు చోట్ల పుడమి ఉగ్రరూపం దాల్చడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ భూకంపాల మధ్య ఏమైనా సంబంధం ఉందా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే, దీనికి 'కాదు' అనే సమాధానం ఇస్తున్నారు కాలిఫోర్నియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన భూకంప శాస్త్రవేత్త డాక్టర్ లూసీ జోన్స్. ఈ భూకంపాలు వేర్వేరు ఫాల్ట్ సిస్టమ్స్ (ఫలకాలు కలిసే సరిహద్దులు, పగుళ్లు), ప్లేట్ బౌండరీల్లో సంభవించాయి. అంటే వాటి మధ్య సంబంధం లేదని అర్థం. ఒకదానిని మరొకటి ప్రేరేపించలేదు. ఒక చోట సంభవించే భారీ భూకంపాలు.. వేల మైళ్ల దూరంలో మరో భూకంపానికి దారితీసే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని జోన్స్ వెల్లడించారు. ఇలా ఒకే సమయంలో వేర్వేరు చోట్ల భూమి కంపించడం అనేది యాదృచ్ఛికమేనని చెబుతున్నారు. ఒక ప్రాంతంలో భూకంపం రావడమనేది అనూహ్యంగా జరిగే సంఘటన కాదు. కొన్ని దశాబ్దాలు, శతాబ్దాలుగా భూగర్భంలో ఒత్తిడి పేరుకుపోయి.. ఫలకాలు ఒకదానికొకటి రాసుకోవడం వల్ల ఇవి సంభవిస్తుంటాయి. అయితే భూకంపాలు సరిగ్గా ఎప్పుడు వస్తాయనేది అంచనా వేయడం అసాధ్యమే అయినా.. ఇలా ఒక్కసారిగా భూమి కంపించడం ఒక చక్రంలా జరిగే పక్రియేనని జోన్స్ పేర్కొన్నారు. కాగా.. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో 3.5 తీవ్రతతో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో భూకంపాలు రాగా.. గురువారం తెల్లవారుజామున పుల్వామాలో భూమి కంపించిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. భూకంప కేంద్రం నేపాల్‌లో 15 కిలోమిటర్ల లోతున ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక, జపాన్‌లో తొలుత భూకంప తీవ్రత 6.9 అని రాగా.. తర్వాత దానిని 7.2గా సవరించారు. చాలా తక్కువ వ్యవధిలో అంటే కొన్ని సెకన్ల నుంచి నిమిషాల తేడాతో దాదాపు ఒకే తీవ్రత గల రెండు భూకంపాలు ఒకే ప్రాంతంలో సంభవించడాన్ని 'ఎర్త్‌క్వేక్ డబ్లెట్' అంటారు. ఒకసారి భూకంపం వచ్చిన తర్వాత తక్కువ తీవ్రతతో చిన్న చిన్న ప్రకంపనలు రావడం సహజమే. కానీ డబ్లెట్ విషయానికొస్తే.. రెండోసారి వచ్చే భూకంపం కూడా దాదాపు మొదటిదానంత తీవ్రంగా ఉంటుంది. ఇప్పుడు వెనెజువెలాలో 39 సెకన్ల వ్యవధిలో వరుస భూకంపాలు వచ్చాయి. దీంతో ఇప్పుడు ఈ దేశ పరిస్థితిని శాస్త్రవేత్తలు 'ఎర్త్‌క్వేక్ డ్లబెట్'గా పిలుస్తున్నారు. వెనెజువెలాలో ఈస్థాయిలో భూకంపం 1900 సంవత్సరంలో వచ్చింది. అప్పుడు దాని తీవ్రత 7.7గా నమోదైంది. దాంతో రాజధాని సమీప ప్రాంతాలు ప్రభావితమయ్యాయి. మళ్లీ 2018లో 7.3 తీవ్రతతో భూమి కంపించినప్పటికీ.. ఆస్తి, ప్రాణనష్టం ఇప్పటితో పోలిస్తే తక్కువగానే సంభవించింది.

# పాస్‌పోర్టు ఫీజులు భారీగా పెంపు

- 14 ఏళ్ల తర్వాత ఛార్జీల సవరణ
- వచ్చే నెల 1 నుంచి కొత్త రుసుము అమలు

న్యూఢిల్లీ, జూన్ 25: కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్టు ఫీజులను భారీగా పెంచింది. దాదాపు 14 ఏళ్ల తర్వాత ఛార్జీలను సవరిస్తూ విదేశాంగ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త రుసుములు వచ్చే నెల 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. 18 ఏళ్లు పైబడిన వారు కొత్తగా 36 పేజీల పాస్‌పోర్టు పొందేందుకు లేదా పునరుద్ధరణ (రీ--ఇష్యూ) కోసం ఇకపై రూ.2,500 చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఈ రుసుము రూ.1,500గా ఉండేది. అత్యవసర సేవ అయిన తత్కాల్ విధానంలో ఇదే పాస్‌పోర్టు కోసం ఫీజును రూ.3,500 నుంచి రూ.5,000కు పెంచారు. 60 పేజీల పాస్‌పోర్టు ఫీజును రూ.2,000 నుంచి రూ.3,500కు పెంచగా, తత్కాల్ విధానంలో ఈ పాస్‌పోర్టు కోసం రూ.6,000 చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఫీజు రూ.4,000గా ఉండేది.

## పోగొట్టుకుంటే మరింత భారం

పాస్‌పోర్టు పోగొట్టుకున్న వారు కొత్తగా 36 పేజీల పాస్‌పోర్టు పొందాలంటే ఇకపై రూ.5,000 చెల్లించాల్సి ఉంటుంది. తత్కాల్ విధానంలో ఈ ఫీజు రూ.7,500గా నిర్ణయించారు. 60 పేజీల పాస్‌పోర్టు విషయంలో సాధారణ ఫీజు రూ.6,000 కాగా, తత్కాల్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే రూ.8,500 చెల్లించాల్సి ఉంటుంది. పాస్‌పోర్టు నిబంధనల్లో మార్పులు చేస్తూ విదేశాంగ శాఖ కొత్త ఫీజులను ప్రకటించింది. చివరిసారిగా 2012లో పాస్‌పోర్టు రుసుములను సవరించగా, ఇప్పుడు 14 ఏళ్ల తర్వాత మరోసారి ఫీజులను పెంచడం గమనార్హం.



# పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీ విచారం



- మధ్యప్రదేశ్ హైకోర్టులో అదనపు పిటిషన్ దాఖలు
- కార్తికేయను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయలేదని వివరణ

**భోపాల్, జూన్ 25:** కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుమారుడు కార్తికేయ సింగ్ చౌహాన్ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కీలక నిర్ణయం తీసుకున్నారు. కార్తికేయ సింగ్‌పై చేసిన వ్యాఖ్యలకు విచారం వ్యక్తం చేస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టులో అదనపు పిటిషన్ దాఖలు చేశారు. తన వ్యాఖ్యలు కార్తికేయను ఉద్దేశించి చేసినవి కావని అందులో స్పష్టం చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ప్రమోద్ కుమార్ అగర్వాల్ విచారణ చేపట్టనున్నారు. 2018లో మధ్యప్రదేశ్‌లోని ఝాబువాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ గాంధీ పనామా పేపర్స్ అంశాన్ని ప్రస్తావిస్తూ కార్తికేయ సింగ్ పేరును ప్రస్తావించారు. తనపై ఆధారరహిత ఆరోపణలు చేసి పరువు నష్టం కలిగించారని ఆరోపిస్తూ కార్తికేయ భోపాల్‌లోని ఎంపీ-ఎమ్మెల్యే ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణకు హాజరుకావాలని ట్రయల్ కోర్టు రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. ట్రయల్ కోర్టు జారీ చేసిన సమన్లను, తనపై నమోదైన పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ రాహుల్ గాంధీ ఇప్పటికే మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో తాజాగా తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తూ మరో పిటిషన్ దాఖలు చేశారు.రాహుల్ గాంధీ తాజా పిటిషన్‌పై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఆధారాలు లేకుండా వ్యాఖ్యలు చేసి తర్వాత విచారం వ్యక్తం చేయడం రాహుల్‌కు అలవాటైందని బీజేపీ ఐటీ సెల్ ఆరోపించింది. కార్తికేయ సింగ్ పేరును ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చిందని ప్రశ్నిస్తూ, ఇటువంటి వ్యాఖ్యలు ఆయన విశ్వసనీయతను దెబ్బతీస్తాయని విమర్శించింది.

# గోడౌన్ కూలిన ఘటనలో 8కి చేరిన మృతుల సంఖ్య

## కొనసాగుతున్న సహాయక చర్యలు..

**కోల్‌కతా, జూన్ 25:** మహానగరంలోని తరతల ప్రాంతంలో గోడౌన్ కుప్పకూలిన సంఘటనలో మ-రణించిన వారి సంఖ్య 8కి పెరిగింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించామని అధికారులు వివరించారు. మరో18 మంది గోడౌన్ శిథిలాల కింద చిక్కుకున్నారని తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో గోడౌన్‌లో 60 మంది వరకు కార్మికులు ఉన్నారని వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భారత ఆర్మీ, నగర పోలీసులతోపాటు స్థానికుల సహకారంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే.. మంత్రులతో కలిసి సీఎం సువేందు అధికారి ఘటన స్థలానికి చేరుకున్నారు. స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరో వైపు బాధితుల కుటుంబ సభ్యుల కోసం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూం.. 8697981070, 033 22143526, 033 22535185 నెంబర్లు విడుదల చేసింది. బుధవారం సాయంత్రం ఈ గోడౌన్ కూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటన జరిగిన వెంటనే ఐదుగురు కార్మికులు మ-రణించగా.. 20 మంది తీవ్రంగా గాయపడిన విషయం విదితమే.



# బీసీల అభివృద్ధే బీజేపీ లక్ష్యం

## ఎన్.రామచందర్ రావు • మదీనాగూడలో ఓబీసీ మోర్చా సమావేశం





**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :**

ప్రధాని నరేంద్ర మోదీ గారి 12 సంవత్సరాల పాలనలో సాధించిన అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై అవగాహన కల్పించేందుకు బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బీసీ కులసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి సారథ్యంలో, శేరిలింగంపల్లి నియోజకవర్గం మదీనాగూడలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం బీసీల అభ్యున్నతి కోసం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. ప్రజల విశ్వాసాన్ని చూరగొనడమే బీజేపీ ధ్యేయమన్నారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్, శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర అధికార ప్రతినిధి రవి కుమార్ యాదవ్, ములుగు జిల్లా ఇన్‌చార్జ్ డా. కొరడాలు నరేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. అజిత్ సేనాపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి సుమన్, రాచమల్ల నాగేశ్వరావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ గౌడ్, చెన్నమనేని శ్రావంతి, జిల్లా కార్యదర్శులు నరేష్ యాదవ్, మాణిక్ రావు, ఎడ్ల అమరేష్ ముదిరాజ్, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి పద్మ, రాష్ట్ర, జిల్లా, డివిజన్ అధ్యక్షులు, ఓబీసీ డివిజన్ స్థాయి నాయకులు, బీసీ కులసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రామచంద్రపురంలో యాంటీ డ్రగ్స్ అవేర్ నెస్ కార్యక్రమం


**మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం..**
**యువతకు పోలీసుల పిలుపు**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి,మండలంలోని రామచంద్రపురం గ్రామంలో శుక్రవారం యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.నేలకొండపల్లి ఎస్ ఐ బి. కోటేశ్వరరావు మాట్లాడుతూ "గంజాయి, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలకు యువత బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఒక్కసారి అలవాటు పడితే బయటపడటం కష్టం. కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి" అని హెచ్చరించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన శిక్షల గురించి వివరించారు. గ్రామంలో ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నా, సేవిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హెచ్ సి ఎం డి. కాసీం కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో , ఎస్ శ్రీనివాసరావు, శివలాల్, శ్రీను, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



# మియాపూర్‌లో ఉచిత మెగా హెల్త్ చెకప్ క్యాంప్

## అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో వందలాది మందికి పరీక్షలు





**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించారు. గురువారం నాగసాయి బాబా దేవాలయం, లక్ష్మీనగర్, మియాపూర్‌లో జరిగిన ఈ క్యాంప్‌లో బీపీ, రాండమ్ బ్లడ్ షుగర్, హార్ట్ రేట్, బీఎంఐ, బాడీ ఫ్యాట్, మసిల్ మాస్, బోన్ మాస్, మెటబాలిక్ ఏజ్, బాడీ వాటర్, విసెరల్ ఫ్యాట్ తదితర పరీక్షలతో పాటు కంటి, దంత వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. విజయ డయాగ్నస్టిక్ సెంటర్, సెంటర్ ఫర్ సైట్, క్లోవ్ డెంటల్ సంస్థలు ఈ క్యాంప్‌కు సహకరించాయి. స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ, "ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇటువంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తాం" అన్నారు. ఈ కార్యక్రమంలో అట్టేపల్లి పురుషోత్తం, శ్రీరాములు, పార్నంది నాగులు, దయాకర్, శ్రీరామ్, కరుణాకర్, ఏఆర్‌పి టీమ్ సభ్యులు, ట్రస్ట్ సభ్యులు, కాలనీ పెద్దలు, యువత, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సంవిధాన్ హత్యా దివస్‌గా జూన్ 25ను పాటిద్దాం

**ఎమర్జెన్సీ చీకటి రోజులను ప్రస్తుత తరానికి తెలియజేయాలి..**
**బీజేపీ మండల అధ్యక్షుడు సుధాకర్**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి: భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం మండల ప్రధాన కార్యదర్శి మల్లెపోయిన గోవిందరావు అధ్యక్షతన నిర్వహించారు ఈ సమావేశంలో బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ "1975 జూన్ 25న దేశంలో ఇందిరాగాంధీ సొంత ప్రయోజనాల కోసం అత్యవసర పరిస్థితిని విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. అనేకమంది జాతీయ వాదులను జైళ్లలో పెట్టించి, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని హత్య చేసిన రోజు ఇది" అని ఆరోపించారు. "ఇకనుంచి జూన్ 25ను ఎమర్జెన్సీ డేగా కాకుండా 'సంవిధాన్ హత్యా దివస్'గా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ప్రజాస్వామ్యానికి చీకటి అధ్యాయం అయిన ఈ దుర్దినాన్ని, అత్యవసర పరిస్థితి పేరుతో ఇందిరాగాంధీ, కాంగ్రెస్ పార్టీ సాగించిన మారణకాండను ప్రస్తుత తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉంది" అని సుధాకర్ అన్నారు."ప్రజాస్వామ్యానికి, ఈ దేశ ప్రయోజనాలకు భంగం కలిగించిన కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపాన్ని బట్టబయలు చేద్దాం. రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు" అని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షులు పురాణం దివాకర్, కొండా హర్షవర్ధన్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు పిట్టల సూరిబాబు, బీజేపీ నాయకులు తొగటి నాగచారి, ఎలివేటి వెంకటేష్, జోగపర్తి నారాయణ, రామారావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పార్ట్ టైం ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** కామారెడ్డి జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఖాళీగా ఉన్న పార్ట్ టైం ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కామారెడ్డి జిల్లా సమన్వయ అధికారి (డీసీఓ) ఎం. శివరాం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బాలుర (ఉప్పల్వాయి, ఎల్లారెడ్డి, బిచ్కుంద), బాలికల (బోర్లం, తక్కడపల్లి, తాడ్వాయి, వ్యాస్, తాడ్కోల్, దోమకొండ, లింగంపేట్) మరియు మహిళ డిగ్రీ కళాశాలల్లో పలు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు (టీజీటీ, పీజీటీ), వ్యాయామ ఉపాధ్యాయులు (పీడీ, పీఈటీ), లైబ్రేరియన్లు ఉన్నాయని తెలిపారు.

**అర్హతలు:** డి.ఎల్ పోస్టులకు నెట్/సెట్/Ph.D. జేఎల్, పీజీటీ, టీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు బి.ఎడ్ అర్హత కలిగిన మహిళ, పురుష అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 24 నుండి 27 వరకు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ఉప్పల్వాయి నందు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తేది 29.06.2026 ఉదయం 10 గంటలకు తాడ్వాయి గురుకుల పాఠశాల/కళాశాలలో డెమోకు హాజరుకావాలని పేర్కొన్నారు. బాలికల పాఠశాలల్లో మహిళల అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడునని జిల్లా సమన్వయ అధికారి ఎం. శివరాం తెలిపారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుషా సతీష్**



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను ధృవీకరించుకోవాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుషా సతీష్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో ఎస్ఐఆర్ కార్యక్రమం అధికారికంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ శశికల, బీఎల్ఓలు చైర్‌పర్సన్ నివాసానికి వెళ్లి ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఓటరు జాబితా పారదర్శకత, ఖచ్చితత్వం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ఈనెల 25 నుంచి జూలై 24 వరకు కొనసాగుతుందని చెప్పారు. ప్రజలు తమ ఇళ్లకు వచ్చే బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. కుటుంబ వివరాలు, తల్లిదండ్రులు, తాతల వివరాలు, ప్రస్తుత నివాస చిరునామా వంటి సమాచారాన్ని ఫారాల్లో సక్రమంగా నమోదు చేసి సమర్పించాలని సూచించారు. ఓటు పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని, ఓటరు జాబితా ప్రక్షాళనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇతర రాష్ట్రాల్లో ఈ ప్రక్రియలో పాల్గొనకపోవడంతో కొంత మంది పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించబడిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. జిల్లాలో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రతి ఓటరు తమ వివరాలను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ రోహిత్, బీఎల్ఓల బృందం తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డ పెళ్లికి యూత్ కాంగ్రెస్ నాయకుడి సహాయం



**రాజముద్ర న్యూస్, తాండూర్:** తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో గురువారం వివాహం జరుగుతున్నటువంటి పేదింటి ఆడబిడ్డకి యూత్ కాంగ్రెస్ తాండూర్ మండల అధ్యక్షులు పట్టెం విష్ణు కళ్యాణ్ తనవంతు సహాయంగా ఎయిర్ కూలర్ అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు ఎండి ఈసా, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి 7వ వార్డు సభ్యులు ఎండి జుబేర్, తాండూర్ టౌన్ ప్రెసిడెంట్ 9వ వార్డ్ సభ్యులు సింగారవ్ శ్రీధర్, నాయకులు సింగరావ్ రఘు, పుప్పాల తిరుపతి, పెద్దబోయిన రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

### ఎస్ఐఆర్ ఓటర్ ప్రక్రియను పరిశీలించిన తహశీల్దార్



**రాజముద్ర న్యూస్, తాండూర్:** ప్రత్యేక సమగ్ర సవరణ ఇంటింటి సర్వేలో భాగంగా ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తాండూర్ తహశీల్దార్ యు.జ్యోత్స్న అన్నారు. మండలంలో గురువారం ప్రారంభమైన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. రెవెన్యూ అధికారులు రేచిని, తాండూర్, చౌటపల్లి గ్రామాల్లో చేపడుతున్న ఎస్ఐఆర్ ఓటర్ నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని బీఎల్ఓలకు సూచించారు. ఓటరు జాబితాల ప్రక్షాళనలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి పారదర్శకంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ పరిశీలనలో తహశీల్దార్ వెంట ఆర్ఐ టి.మురళీధర్ రావు, జూనియర్ అసిస్టెంట్ శ్రీపద్మ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదలకు భరోసా

- డబ్బా గ్రామంలో ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ దండే విఠల్



**రాజముద్ర న్యూస్, కాగజ్నగర్:** ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేదలకు ప్రభుత్వం భరోసా నిస్తుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. చింతలమనేపల్లి మండలం డబ్బా గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ గృహాన్ని గురువారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు బోర్లే లలిత మెంగజి నూతన గృహాన్ని రిబ్బెన్ కట్ చేసి ప్రారంభించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పాడి రైతుల అభివృద్ధికి సహకార సంఘాలే బలం

**రాజముద్ర న్యూస్, బిక్కనూరు:**
పాడి రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించి పాల ఉత్పత్తిని పెంచుకోవాలని తెలంగాణ సహకార యూనియన్ ప్రిన్సిపల్ భూక్య వెంకన్న సూచించారు. గురువారం బిక్కనూరు పాలకేంద్రంలో నిర్వహించిన పాల ఉత్పత్తిదారుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల ద్వారా రైతులకు లభించే ప్రయోజనాలు, పశుసంవర్ధక రంగంలో తాజా మార్పులు, పాల నాణ్యత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించారు. సహకార సంఘాల బలోపేతంతో పాడి పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.కార్యక్రమంలో బిక్కనూరు బీఎంసీయూ అధ్యక్షుడు ఏనుగు లోహిత్ రెడ్డి, విజయ డెయిరీ కామారెడ్డి మేనేజర్ వైష్ణవి పాల్గొని రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు.ఈ సందర్భంగా పాలకేంద్రం అధ్యక్షుడు బత్తుల రాజు, ఉపాధ్యక్షుడు బచ్చగారి సిద్ధరాములు, ప్రధాన కార్యదర్శి పప్పుల శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు బండి స్వామి, బుచ్చముల బాలరాజు, పాపన్నగారి రాజుతో పాటు పలువురు పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

# సీనియర్ నాయకుడు సయ్యద్ గౌస్‌కు కేటీఆర్ అరుదైన గౌరవం!

## చేవెళ్ల వేదికగా నవాబుపేట్ నేతకు దక్కిన ప్రత్యేక గుర్తింపు

- ఉద్యమకారులకు అన్యాయం జరిగింది వాస్తవమే..
- రాబోవు రోజుల్లో అధికారం మనదే, అందరికీ న్యాయం చేస్తాం'
- చేవెళ్ల మెంబర్‌షిప్ సభలో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ మెంబర్‌షిప్ సమావేశం పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) సమక్షంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నుండి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సభ నవాబుపేట్ మండలానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు సయ్యద్ గౌస్ పేరు ప్రత్యేకంగా కేటీఆర్

**స్టేజీపై నుండి గుర్తించి, పేరు పెట్టి పిలిచిన కేటీఆర్!**

సభ జరుగుతున్న సమయంలో నవాబుపేట్ మండలం నుండి తరలివచ్చిన జన సందోహంలో ఉన్న సీనియర్ నేత సయ్యద్ గౌస్‌ను కేటీఆర్ స్వయంగా స్టేజీపై నుండి గుర్తించారు వేదికపైకి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఒక అగ్రనేత అంతటి భారీ బహిరంగ సభలో, వేలాది మంది మధ్య తనను గుర్తుపట్టి స్టేజీపైకి పిలవడంతో సయ్యద్ గౌస్‌తో పాటు నవాబుపేట్ మండల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. సయ్యద్ గౌస్‌ను ఉద్దేశిస్తూ కేటీఆర్ వేదికపై సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో పార్టీ కోసం, తెలంగాణ ఉద్యమం కోసం ప్రాణాలర్పించిన, కష్టపడిన కొంతమంది ఉద్యమకారులకు కొన్ని కారణాల వల్ల అన్యాయం జరిగిన మాట వాస్తవమేనని కేటీఆర్ బహిరంగంగానే అంగీకరించారు. గతంలో ఉద్యమకారులకు అన్యాయం జరిగిన విషయం నిజమే. కానీ సయ్యద్ గౌస్ లాంటి సీనియర్ నేతలు పార్టీని నమ్ముకుని ఉన్నారు. రాబోయే రోజుల్లో మన పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. రాగానే మొదటి ప్రాధాన్యతగా ఉద్యమకారులందరికీ పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చూస్తాం అన్నారు. ఇదే ఉత్సాహంతో సయ్యద్ గౌస్ నేతృత్వంలో నవాబుపేట్ మండలంలో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి, డిజిటల్ మెంబర్‌షిప్ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మరింత కృషి చేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో భాగంగా నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారిన ఎస్ ఐ ఆర్' అంశంపై కేటీఆర్ సుదీర్ఘంగా వివరించారు. దీనిపై ప్రజల్లో, రైతుల్లో ఉన్న అపోహలను తొలగించే ప్రయత్నం చేశారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నవాబుపేట్ మండలం నుండి భారీ సంఖ్యలో తరలివచ్చిన ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కేటీఆర్ ప్రసంగానికి, ముఖ్యంగా సయ్యద్ గౌస్‌కు దక్కిన గౌరవానికి సంఘీభావం తెలుపుతూ జై తెలంగాణ నినాదాలతో సభా ప్రాంగణాన్ని హోరెత్తించారు.

## రామచంద్రపురంలో బొడ్రాయి, కనకదుర్గమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ తల్లి, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

**భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహణ..**
**పెద్ద ఎత్తున హాజరైన గ్రామ ప్రజలు**






**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి: మండలంలోని రామచంద్రపురం గ్రామంలో బొడ్రాయి, కనకదుర్గమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ తల్లి మరియు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది.ఉదయం నుంచి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, హోమాలు నిర్వహించారు. శుభ ముహూర్తంలో విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ, కుంభాభిషేకం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రామచంద్రపురం గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. యువకులు, భక్తులు భజనలు, కోలాటాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపారు.గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠతో పాటు గ్రామ దేవతలైన కనకదుర్గమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ తల్లి, ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించడం గ్రామానికి శుభ సూచకమని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలుగుతాయని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.విగ్రహ ప్రతిష్ఠ అనంతరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ గ్రామ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావం: పగులుబారిన నేలలు, బెంగటిల్లిన రైతన్న

### ఆశించిన స్థాయిలో కురవని వర్షాలు.. ప్రశ్నార్థకంగా మారిన ఖరీఫ్ సాగు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి: ఆకాశం వైపు దీనంగా చూస్తున్న రైతన్న కళ్లల్లో ఎల్‌నినో భయం స్పష్టంగా కనిపిస్తోంది. నైరుతి రుతుపవనాలు బలహీనపడి, జూన్ నెల ముగుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సాగుపై తీవ్ర అనిశ్చితి నెలకొంది. పగులుబారిన నేలలు, వాడిపోయిన మొక్కలు, కన్నీటి పర్యంతమవుతున్న అన్నదాతలు కరువు ఛాయలకు అద్దం పడుతున్నాయి. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండటంతో వర్షపాతంలో భారీ లోటు ఏర్పడింది. జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 40 శాతం తక్కువగా నమోదైందని వాతావరణ శాఖ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో వరి నాట్లు, పత్తి, మొక్కజొన్న విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధపడ్డా, నేలలో తేమ లేకపోవడంతో ముందడుగు వేయలేకపోతున్నారు. బోర్లు, బావుల్లో నీటిమట్టం అడుగంటిపోవడంతో ప్రత్యామ్నాయ సాగునీటి వసతులు కూడా కరవయ్యాయి. నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "ఎకరానికి 30 వేల వరకు పెట్టుబడి పెట్టి విత్తనాలు, ఎరువులు తెచ్చుకున్నాం. కానీ చినుకు జాడ లేదు. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు" అని చెన్నారం గ్రామ కౌలు రైతు కిషన్ కన్నీటి పర్యంతమయ్యారు. వర్షాభావంతో ఇప్పటికే విత్తిన మొక్కజొన్న పంట పొలంలోనే ఎండిపోయిందని, పెట్టుబడి మొత్తం నష్టపోయామని పైనంపల్లి రైతులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు కీలక సూచనలు చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం సెప్టెంబర్ వరకు కొనసాగే అవకాశం ఉందని, కాబట్టి రైతులు వరి వంటి నీటి అవసరం ఎక్కువ ఉండే పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, వేరుశనగ వంటి ఆరుతడి పంటలు తక్కువ నీటితో, తక్కువ కాలంలో చేతికి వస్తాయని వివరిస్తున్నారు. "ఖరీఫ్‌లో వరి సాగు ప్రమాదకరం. ఒకవేళ వర్షాలు పడినా చివర్లో తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. అందుకే రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలి. సూక్ష్మ సేద్యం, డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా నీటిని పొదుపుగా వాడాలి" అని ఖమ్మం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కరువు మండలాలను ప్రకటించాలని, రైతులకు విత్తనాలు, ఎరువులపై రాయితీ ఇవ్వాలని, పాత అప్పులు రీషెడ్యూల్ చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పొడి వాతావరణంలో ఖరీఫ్ సాగు ఎలా అన్నది ఇప్పుడు రైతుల ముందున్న అతిపెద్ద ప్రశ్న. శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తూ, వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ సాగు చేస్తే నష్టాన్ని కొంతమేర తగ్గించుకోవచ్చని నిపుణులు భరోసా ఇస్తున్నారు. కానీ ఆకాశం కరుణించి వర్షం కురిస్తే తప్ప అన్నదాతకు కష్టాలు తీరేలా లేవు.



# భారత్-ఐర్లాండ్ టీ20 మ్యాచ్ సమయాల్లో మార్పు




**బెల్‌ఫాస్ట్, జూన్ 25 :** భారత్–ఐర్లాండ్ మధ్య జరగనున్న రెండు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల ప్రారంభ సమయాల్లో మార్పు చేసినట్లు క్రికెట్ ఐర్లాండ్ ప్రకటించింది. తొలుత సాయంత్రం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన మ్యాచ్‌లు ఇప్పుడు సాయంత్రం 6 గంటలకే ప్రారంభం కానున్నాయి. జూన్ 28న జరగనున్న రెండో టీ20 మ్యాచ్ సమయం, అదే రోజు మహిళల ప్రపంచకప్‌లో భారత్––ఆస్ట్రేలియా మ్యాచ్‌తో కలిసిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రసార భాగస్వాములతో చర్చల అనంతరం మ్యాచ్ సమయాన్ని ముందుకు మార్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ రెండు మ్యాచ్‌లు బెల్‌ఫాస్ట్‌లోని సివిల్ సర్వీస్ క్రికెట్ క్లబ్ వేదికగా జూన్ 26, 28 తేదీల్లో జరగనున్నాయి. ఈ సిరీస్ ద్వారా శ్రేయస్ అయ్యర్ భారత టీ20 జట్టుకు కొత్త కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించనుండగా, ఐర్లాండ్ జట్టుకు లోర్కన్ టక్కర్ నాయకత్వం వహించనున్నారు. మ్యాచ్ సమయ మార్పుతో అభిమానులకు రెండు కీలక క్రికెట్ మ్యాచ్‌లను సజావుగా వీక్షించే అవకాశం లభించనుంది.

# కోహ్లీ వన్8 షూస్‌కు భారీ స్పందన

## 24 గంటల్లోనే లక్షన్నర జతలు అమ్మకం



**ముంబై, జూన్ 25 :** టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ మరోసారి తన బ్రాండ్ విలువతో వార్తల్లో నిలిచాడు. ఆయన ప్రారంభించిన 'వన్8' గ్లోబల్ షూ బ్రాండ్ లాంచ్ అయిన కేవలం 24 గంటల్లోనే లక్షన్నర జతలు అమ్ముడై సరికొత్త రికార్డు సృష్టించాయి. ఈ అమ్మకాలతో ఒక్కరోజులోనే రూ.138 కోట్లకు పైగా ఆదాయం వచ్చినట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. క్రీడా రంగంలో మాత్రమే కాకుండా వ్యాపార ప్రపంచంలోనూ కోహ్లీకి ఉన్న క్రేజ్ ఈ ఫలితాలతో స్పష్టమవుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈ షూస్ ధరను కోహ్లీ టెస్ట్ క్రికెట్‌లో సాధించిన 9,230 పరుగులకు గుర్తుగా రూ.9,230గా నిర్ణయించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రీ–బుకింగ్ ఆధారంగా మాత్రమే అమ్మకాలు జరగడంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. లాంచ్ ఈవెంట్‌లో పాల్గొనడానికి కూడా ప్రత్యేకంగా ప్రీ–బుక్ చేసిన కొనుగోలుదారులకే అవకాశం కల్పించారు. అయినప్పటికీ అభిమానుల నుంచి ఊహించని స్థాయిలో స్పందన లభించడం గమనార్హం. ఈ విజయంతో కోహ్లీ కేవలం క్రికెటర్‌గా మాత్రమే కాకుండా, గ్లోబల్ స్పోర్ట్స్ బ్రాండ్ ఐకాన్‌గా తన స్థానాన్ని మరింత బలపర్చుకున్నారని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.



# భారత క్రికెట్ చరిత్రను మార్చిన రోజు

**లండన్, జూన్ 25 :** భారత క్రికెట్ దిశను పూర్తిగా మార్చేసిన చారిత్రాత్మక రోజు జూన్ 25. 1983లో ఇదే రోజున కపిల్ దేవ్ నేతృత్వంలోని టీమిండియా ప్రపంచ క్రికెట్‌ను ఏలుతున్న వెస్టిండీస్‌ను ఓడించి తొలి వన్డే ప్రపంచకప్‌ను గెలుచుకుంది. లార్డ్స్ మైదానంలో జరిగిన ఆ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, వెస్టిండీస్ పేస్ దాడిని ఎదుర్కోలేక 60 ఓవర్లలో 183 పరుగులకే ఆలౌట్ అయింది. తక్కువ స్కోరు అయినప్పటికీ భారత బౌలర్లు అద్భుత ప్రదర్శన చేసి విండీస్ జట్టును 140 పరుగులకే కుప్పకూల్చారు. దీంతో భారత్ 43 పరుగుల తేడాతో చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో కీలక మలుపుగా నిలిచింది వివ్ రిచర్డ్స్ ఇచ్చిన క్యాచ్. కెప్టెన్ కపిల్ దేవ్ వెనక్కి పరుగెత్తుతూ తీసిన ఆ అద్భుత క్యాచ్ మ్యాచ్ గమనాన్నే మార్చేసింది. ఆ వికెట్ తర్వాత వెస్టిండీస్ పతనం ప్రారంభమై చివరకు ఓటమికి దారితీసింది. ఈ విజయంతో భారత్‌లో క్రికెట్ కేవలం ఆటగా కాకుండా ఒక భావోద్వేగంగా మారిందని విశ్లేషకులు చెబుతున్నారు. తరువాతి తరంలో సచిన్ టెండూల్కర్ వంటి దిగ్గజాల ఎదుగుదలకు ఈ విజయం స్ఫూర్తిగా నిలిచింది. అంతేకాకుండా భారత క్రికెట్ బోర్డు ప్రపంచ స్థాయిలో శక్తివంతమైన సంస్థగా ఎదగడానికి ఈ రోజు పునాది వేసినట్టుగా భావిస్తారు.

## ఇంగ్లండ్ వన్డే సిరీస్ జట్టుపై

# మంజ్రేకర్ విమర్శలు

### జైస్వాల్ పక్కన పెట్టడంపై చర్చ



**ముంబై, జూన్ 25 :** ఇంగ్లండ్‌తో జరగనున్న వన్డే సిరీస్ కోసం భారత జట్టును ప్రకటించిన నేపథ్యంలో సెలక్షన్ నిర్ణయాలపై మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యంగా ఫామ్‌లో ఉన్న యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను జట్టులోకి తీసుకోకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు. మంజ్రేకర్ మాట్లాడుతూ, జైస్వాల్ తన చివరి మూడు వన్డేల్లో అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ అతనికి అవకాశం ఇవ్వకపోవడం కఠినమైన నిర్ణయమని అభిప్రాయపడ్డారు. "అలాంటి ఫామ్‌లో ఉన్న ఆటగాడిని పక్కనపెట్టడం అన్యాయం" అని ఆయన వ్యాఖ్యానించారు. అదే సమయంలో కెప్టెన్ రోహిత్ శర్మ ఎంపికపై కూడా ఆయన పరోక్ష వ్యాఖ్యలు చేశారు. స్టార్ ఆటగాళ్ల ప్రాధాన్యత ఆధారంగా కాకుండా, పూర్తిగా ప్రదర్శన ఆధారంగానే జట్టు ఎంపిక జరగాలని అన్నారు. భారత క్రికెట్‌లో పెద్ద పేర్ల ప్రభావం ఎక్కువగా ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. "సెలక్షన్ అనేది వ్యక్తుల కోసం కాకుండా భారత క్రికెట్ భవిష్యత్తు కోసం ఉండాలి" అని మంజ్రేకర్ స్పష్టం చేశారు. రాబోయే ప్రపంచకప్ ప్రణాళికల్లో రోహిత్ పాత్రపై కూడా స్పష్టత అవసరమని సూచించారు. ఇదే సమయంలో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు.



# మూడేళ్ల తర్వాత బ్రెజిల్ జెర్సీలో నెయ్‌మార్ పునరాగమనం..

**మియామి, జూన్ 25 :** ఫుట్‌బాల్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూసిన క్షణం చివరకు సాకారమైంది. బ్రెజిల్ స్టార్ ఆటగాడు నెయ్‌మార్ దాదాపు మూడేళ్ల (981 రోజులు) విరామం తర్వాత జాతీయ జట్టు జెర్సీని తిరిగి ధరించాడు. ఫిఫా ప్రపంచకప్ 2026 గ్రూప్–సి మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో జరిగిన పోరులో నెయ్‌మార్ 76వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి అడుగుపెట్టాడు. అతను వార్మప్ చేస్తున్న క్షణాల నుంచే స్టేడియంలో అభిమానులు కరతాళ ధ్వనులతో ఉత్సాహం వ్యక్తం చేశారు. 2023 అక్టోబర్‌లో ఉరుగ్వేతో జరిగిన మ్యాచ్‌లో తీవ్రమైన మోకాలి గాయంతో అతను ఆటకు దూరమయ్యాడు. శస్త్రచికిత్స తర్వాత దీర్ఘకాలం విశ్రాంతి తీసుకున్న నెయ్‌మార్, 34 ఏళ్ల వయసులో తిరిగి ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి రావడం ప్రత్యేకంగా నిలిచింది. మ్యాచ్ అనంతరం భావోద్వేగానికి లోనైన నెయ్‌మార్ మాట్లాడుతూ, "మూడేళ్ల తర్వాత మళ్లీ జాతీయ జెర్సీ ధరించడం మాటల్లో చెప్పలేని ఆనందం" అని తెలిపాడు. ఆటకు దూరంగా ఉన్న కాలం తనకు మానసికంగా ఎంతో కష్టంగా గడిచిందని ఆయన చెప్పాడు. ఈ మ్యాచ్‌లో బ్రెజిల్ 3–0 తేడాతో ఘన విజయం సాధించగా, వినిసియస్ జూనియర్ రెండు గోల్స్‌తో మెరిశాడు. నెయ్‌మార్ రాక జట్టుకు మరింత ఆత్మవిశ్వాసం ఇచ్చిందని సహచర ఆటగాళ్లు అభిప్రాయపడ్డారు.




# అభిషేక్ పోరెల్‌పై పెళ్లి పేరుతో మోసం ఆరోపణలు..

కోల్‌కతా, జూన్ 25 : ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ అభిషేక్ పోరెల్ చుట్టూ వివాదం చోటుచేసుకుంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ ఓ యువతి చేసిన ఆరోపణలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా మొగ్రా పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు తన తల్లితో కలిసి వెళ్లి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తనతో గత మూడేళ్లుగా సంబంధంలో ఉన్న అభిషేక్ పోరెల్, పెళ్లి చేస్తానని నమ్మించి తర్వాత దూరమయ్యాడని ఆమె ఆరోపించింది. అంతేకాక తనపై దాడి చేశాడని కూడా ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇక ఈ ఆరోపణలను అభిషేక్ పోరెల్ తీవ్రంగా ఖండించాడు. తన క్రికెట్ కెరీర్‌లో మంచి ఫామ్‌లో ఉన్న సమయంలో కావాలనే తన పేరును వివాదాల్లోకి లాగుతున్నారని ఆయన స్పందించినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ వ్యవహారం చట్టపరమైన విచారణ దశలో ఉంది.



# న్యూజిలాండ్‌కు ఎదురుదెబ్బ

నాటింగ్‌హమ్, జూన్ 25: ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌కు ముందు న్యూజిలాండ్ జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. కీలక ఆటగాళ్లు మ్యాట్ హెన్రీ, గ్లెన్ ఫిలిప్స్ గాయాల కారణంగా చివరి టెస్టుకు దూరమయ్యారు. కెన్నింగ్టన్ ఓవల్‌లో జరిగిన రెండో టెస్టులో న్యూజిలాండ్ విజయంలో వీరిద్దరూ కీలక పాత్ర పోషించారు. గ్లెన్ ఫిలిప్స్ తొలి ఇన్నింగ్స్‌లో శతకం సాధించగా, మ్యాట్ హెన్రీ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 11 వికెట్లు తీసి ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను కుదేలు చేశాడు. న్యూజిలాండ్ క్రికెట్ తెలిపిన వివరాల ప్రకారం, హెన్రీ ఎడమ కాలి పిక్క కండరంలో స్వల్ప చీలికకు గురయ్యాడు. అతడు కోలుకోవడానికి రెండు నుంచి నాలుగు వారాల సమయం పట్టే అవకాశం ఉంది. మరోవైపు పక్కటెముకల నొప్పితో బాధపడుతున్న గ్లెన్ ఫిలిప్స్ కూడా మూడో టెస్టుకు అందుబాటులో ఉండడని జట్టు యాజమాన్యం వెల్లడించింది. ఇప్పటికే సిరీస్‌ను సమం చేసిన న్యూజిలాండ్, మూడో టెస్టులో గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని భావిస్తున్న సమయంలో ఈ ఇద్దరు ఆటగాళ్లు దూరం కావడం జట్టుకు పెద్ద లోటుగా మారింది. వీరి స్థానాల్లో బెన్ సియర్స్, మిచెల్ శాంట్నర్‌లను జట్టులోకి ఎంపిక చేశారు.




# 'ఎన్బీకే112' షురూ

**అమరావతి, జూన్ 25:** నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా, దర్శకుడు కొరటాల శివ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఎన్బీకే112' పూజా కార్యక్రమాలతో అమరావతిలో ఘనంగా ప్రారంభమైంది. నవ్యాంధ్ర రాజధానిలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరై తొలి సన్నివేశానికి క్లాప్ కొట్టారు. బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని కెమెరా స్విచ్ ఆన్ చేయగా, అనంతరం బాలకృష్ణ తన సినిమా డైలాగ్‌తో అభిమానులను అలరించారు. కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, నిర్మాత సురేశ్ బాబు సహా సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ అమరావతి ప్రస్తుతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని అన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమను విస్తరించాలనే ఉద్దేశంతో ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని అమరావతిలో నిర్వహించినట్లు తెలిపారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ పుట్టిన ఈ నేలపై సినీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అనేక అందమైన చిత్రీకరణ ప్రదేశాలు ఉన్నాయని, అందరి సహకారంతో పరిశ్రమను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ తాను ఇప్పటి వరకు సినిమా షూటింగ్‌లు, ప్రదర్శనలకు మాత్రమే వెళ్లానని, తొలిసారిగా ఓ సినిమా ప్రారంభోత్సవానికి హాజరై క్లాప్ కొట్టానని అన్నారు. తన ముద్దుల మామయ్య బాలకృష్ణ చిత్రానికి క్లాప్ కొట్టడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. బాలకృష్ణ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తామని చెప్పారు. అమరావతి పవిత్ర భూమి అని, భవిష్యత్తులో మరిన్ని సినిమాలు ఇక్కడే ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. సమాచారం ప్రకారం ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానుండగా, 2027 వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం ప్రణాళిక రూపొందిస్తోంది. బాలకృష్ణ-కొరటాల శివ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# 'ఇడుపు కాయితం' ప్రారంభం





విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నటుడు ప్రియదర్శి ప్రధాన పాత్రలో, జానపద గాయని నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తున్న 'ఇడుపు కాయితం' చిత్రం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణ వాడుక భాషలో 'ఇడుపు కాయితం' అంటే 'విడాకుల పత్రం' అనే అర్థం. వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సుకుమార్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ విడుదల చేశారు. సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిర్మాత బన్నీవాసు మాట్లాడుతూ మంచి కథకు ప్రాంతీయ హద్దులు ఉండవని మరోసారి ఈ చిత్రం నిరూపిస్తుందని అన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే కథ అని, తెలుగు సినిమా అయినప్పటికీ ఇతర రాష్ట్రాల ప్రేక్షకులను సైతం మెప్పించే అంశాలు ఇందులో ఉన్నాయని తెలిపారు. ప్రతి కుటుంబంలో కనిపించే ఓ సాధారణ సమస్యను ప్రధానాంశంగా తీసుకుని ఈ కథను రూపొందించామని బన్నీవాసు చెప్పారు. పెళ్లైన ప్రతి ఒక్కరూ ఈ చిత్రంలోని భావోద్వేగాలకు అనుసంధానం అవుతారని అన్నారు. కుటుంబ సంబంధాలు, అత్తా కోడళ్ల మధ్య బంధాలను హృద్యంగా చూపించే కథగా ఈ చిత్రం నిలుస్తుందని పేర్కొన్నారు. హీరోయిన్ పాత్ర కోసం నాగదుర్గను సంప్రదించినప్పుడు ఆమె తనకు 15 షరతులు పెట్టిందని బన్నీవాసు వెల్లడించారు. ఆ షరతులు విన్న తర్వాత ఒక తెలుగు అమ్మాయి తన కెరీర్, పాత్రల ఎంపిక విషయంలో ఎంత స్పష్టతతో ఉంటుందో అర్థమైందని చెప్పారు. ఇప్పటికే జానపద గీతాలతో మంచి గుర్తింపు సంపాదించుకున్న నాగదుర్గ ఈ చిత్రంతో వెండితెరకు పరిచయం కానుంది. సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ నుంచి వచ్చిన చిత్రాలు ప్రత్యేక గుర్తింపు పొందాయని, 'ఇడుపు కాయితం' కూడా అదే స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ పొందే చిత్రంగా నిలుస్తుందని నిర్మాత తబిత సుకుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. కుటుంబ బంధాలు, భావోద్వేగాలతో కూడిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందని చిత్ర బృందం తెలిపింది.

# వెండితెరపైకి వస్తోన్న మిర్జాపూర్




అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించడానికి సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో మూడు సీజన్ల పాటు ఓటీటీ ప్రేక్షకులను అలరించిన ఈ సిరీస్, ఇప్పుడు 'మిర్జాపూర్: ది మూవీ' పేరుతో భారీ ఫీచర్ ఫిల్మ్‌గా రాబోతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సినిమాకు సంబంధించిన అధికారిక టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌లో పంకజ్ త్రిపాఠి కాలీన్ భయ్యాగా, అలీ ఫజల్ గుడ్డూ భయ్యాగా, దివ్యేందు మున్నా భయ్యాగా తమ ఐకానిక్ పాత్రల్లో మళ్లీ కనిపించి అభిమానులను అలరించారు. మరోవైపు ఈ చిత్రంలో రవి కిషన్, పంచాయత్ ఫేమ్ జితేంద్ర కుమార్ కీలక పాత్రల్లో ఎంట్రీ ఇస్తూ మరింత ఆసక్తిని పెంచుతున్నారు. రెండు నిమిషాల కంటే ఎక్కువ నిడివి ఉన్న ఈ టీజర్ పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తూ, మరింత భారీ యాక్షన్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో సాగింది. ఈ సారి కేవలం మిర్జాపూర్ గద్దె కోసమే కాకుండా అధికారం కోసం కూడా యుద్ధం జరగబోతోందని టీజర్‌తో స్పష్టమవుతుంది. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. కేవలం హిందీలోనే కాకుండా ఇతర భాషలో కూడా థియేటర్లలో విడుదలరాబోతున్నట్లు తెలుస్తుంది.

# లోకేష్ సినిమాలో కొత్త లుక్‌లో బన్నీ




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అధికారిక ప్రకటన వెలువడినప్పటి నుంచే ఈ ప్రాజెక్ట్ సినీ వర్గాలు, అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికర వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ దర్శకుడు అట్లీతో కలిసి 'రాకా' చిత్రంలో నటిస్తున్నాడు. భారీ వ్యయంతో, అత్యాధునిక సాంకేతికతతో రూపొందుతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. అయితే ఆ చిత్రంలో కనిపించే లుక్‌కు పూర్తిగా భిన్నంగా లోకేష్ కనగరాజ్ సినిమాలో కనిపించేందుకు అల్లు అర్జున్ సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. లోకేష్ కనగరాజ్ తన చిత్రాల్లో హీరోలను కొత్త కోణంలో చూపించడంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్‌ను కూడా ఇప్పటివరకు ఎప్పుడూ కనిపించని విధంగా తెరపై ఆవిష్కరించేందుకు ఆయన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

## 'రాకా' తర్వాత పూర్తి దృష్టి

'రాకా' చిత్రం పనులు పూర్తైన వెంటనే లోకేష్ కనగరాజ్ సినిమా కోసం అల్లు అర్జున్ తన రూపురేఖల్లో మార్పులు చేసుకోనున్నట్లు సమాచారం. పాత్రకు అనుగుణంగా ప్రత్యేక మేకోవర్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నాడనే వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది. అల్లు అర్జున్-లోకేష్ కనగరాజ్ కలయికలో సినిమా వస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యాక్షన్, భావోద్వేగాలు, లోకేష్ ప్రత్యేక శైలితో రూపొందనున్న ఈ చిత్రం భవిష్యత్తులో అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# అందాల నిధిని వరించని అదృష్టం

అందాల భామ నిధి అగర్వాల్ చివరి చిత్రం రాజాసాబ్. ఈ సినిమా వచ్చి దాదాపు ఆరు నెలలు గడిచినా ఇప్పటి దాకా మరో కొత్త ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించలేదు. హరిహర వీరమల్లు, రాజా సాబ్ తర్వాత పెద్ద పెద్ద ఆఫర్లు వస్తాయని ఆశించిన నిధికి అదృష్టం కలిసి రావడం లేదు. ఆ రెండు చిత్రాలు డిజాస్టర్ కావడంతో అవకాశాలు ఏమో కానీ అమెను పలకరించిన దర్శకనిర్మాతలే లేరు. ఇక లాభం లేదనుకున్న నిధి ప్రస్తుతంబ్రాండ్ ఎండార్స్‌మెంట్స్, కమర్షియల్ ప్రదర్శనలపై దృష్టి పెట్టారు. ఇవే ఆమెకు స్థిరమైన ఆదాయ వనరుగా ఉన్నాయని సమాచారం. నెలకు రూ 5 లక్షలు ఖర్చు నటి జీవితంలో నెలకు వచ్చే ఖర్చుల గురించి ఒక ఇంటర్వ్యూలో నిధి అగర్వాల్ వివరించారు. కనీసం నెలకు రూ 5 లక్షలు ఖర్చవుతాయని తెలిపారు. ఈ ఖర్చులో ప్రయాణం, వసతి, ఫిట్‌నెస్, ఆహారం, మొత్తం జీవనశైలిని నిర్వహించడానికి అయ్యే వ్యయాలు ఉంటాయని చెప్పారు. ఇవి కాకుండా, వ్యక్తిగత సిబ్బందిపై అయ్యే ఖర్చులు అదనంగా ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. ఒక సెలబ్రిటీగా కనిపించడానికి అవసరమైన ప్రతిదానిపై నిరంతరం ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు. బయటకు కనిపించే గ్లామర్ వెనుక ఉన్న వాస్తవాలు ఇవేనని ఆమె అభిప్రాయాన్ని వెల్లడించారు. ఖర్చులు మాత్రం సమానంగా సినీ రంగంలో హీరోలకు ఎక్కువ పారితోషికం లభిస్తుందని, కానీ హీరోయిన్లకు తక్కువే వస్తుందని కూడా ఆమె వెల్లడించారు. అయినప్పటికీ, ఖర్చులు మాత్రం సమానంగానే ఉంటాయని ఆమె పేర్కొన్నారు. నటీమణులు తమ రూపం, ఫిట్‌నెస్, ఇమేజ్‌ను నిలబెట్టుకోవడానికి నిరంతరం పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని చెప్పారు.మొత్తంగా, నిధి అగర్వాల్ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ రంగంలో నటీమణులు ఎదుర్కొనే ఆర్థిక ఒత్తిడిని ప్రతిబింబిస్తున్నాయి. స్థిరమైన ఆదాయం లేకపోయినా, ఖర్చులు మాత్రం నిరంతరం ఉండటం ఒక పెద్ద సవాల్‌గా మారుతుందని ఆమె మాటలు సూచిస్తున్నాయి.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com